www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 256 | ఆదివారం | 16- 02 - 2025 | ఎడిటర్ : పి. జయరాం | పేజీలు : 8 | వెల : 4

## మాపై పెట్టిన కేసులు ఉపసంహరించకపోతే నిరవధిక నిరాహార దీక్షలు చేస్తాం



3

## ఏఐపై వట్టి మాటలు కాదు, గట్టి చేతలు కావాలి

### ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను భారత్ అందిపుచ్చుకోవడం లేదు

తొలిఅడుగు, న్యూఢిల్లీ : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను భారత్ అందిపుచ్చుకోవడం లేదని, వట్టి మాటలతో ప్రయోజనం ఉండదని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. డ్రోన్లు, ఏఐ వంటి కొత్త సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు మనకు బలమైన పునాది కావాలని సూచించారు. డ్రోన్ సాంకేతికతను వివరిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక వీడియోను ఆయన పోస్ట్ చేశారు. డ్రోన్లు యుద్ధ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చేశాయి. బ్యాటరీలు, మోటార్లు, ఆప్టికల్స్ జత

2



## కులం.. అభివృద్ధికి ఆటంకం

తొలిఅడుగు, చెన్నై: సమాజాన్ని చీల్చి తారతమ్యాలకు దోహదపడుతున్న కులం అభివృద్ధికి అడ్డంగా ఉందని మద్రాసు హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. కోవై ఆవల్‌పట్టిలో ఉన్న ఓ ఆలయానికి నిర్దేశిత కులానికి చెందిన వారిని ట్రస్టీలుగా నియమించాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు... అల్లర్లు సృష్టించే కులం అభివృద్ధికి వ్యతిరేకం. సమాజాన్ని చీల్చి, తారతమ్యాలకు దోహదపడుతున్న కులం అభివృద్ధికి ఆటంకం. కులాన్ని శాశ్వతం చేయాలనే



2

## కంపెనీలను వదలని సైబర్ నేరగాళ్లు



తొలిఅడుగు, హైదరాబాద్ : పోలీసులు సైబర్ నేరాల విషయంలో ఎన్ని మార్లు అవగాహన కల్పించినా.. పదే పదే మోసపోతూనే ఉన్నారు. తాజాగా వ్యక్తులనే కాదు.. ఏకంగా ఓ కంపెనీ కూడా సైబర్ నేరగాళ్ల గాలానికి చిక్కింది. నకిలీ ఈమెయిల్ ద్వారా కోట్లను కొల్లగొట్టారు

2

## మోదీపై నేను ఎలాంటి వ్యక్తిగత కామెంట్లు చేయలేదు

### క్లారిటీ ఇచ్చిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తొలిఅడుగు, హైదరాబాద్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై తాను ఎలాంటి వ్యక్తిగత కామెంట్లు చేయలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి కుర్చీని అగౌరవపరచలేదని స్పష్టం చేశారు. శుక్రవారం జరిగిన యూత్ కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడిన రేవంత్ మోదీ కులం గురించి వ్యాఖ్యలు చేశారు. 'ఆయన పుట్టుకతోనే బిసి కాదు, తొలిసారి ముఖ్యమంత్రి అయ్యాక తన కులాన్ని బిసిల్లో కలిపారు' అంటూ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆయనపై బిజెపి నేతలు తీవ్రంగా మండిపడ్డారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్ పలువురు ప్రధాన నేతలతో సమావేశం అవుతున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశం అయ్యారు. తెలంగాణలో జరుగుతున్న రాజకీయ, ఇతర అంశాలను ఆయన రాహుల్‌కి వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'కులగణన, ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ దేశానికి రోల్ మోడల్. ఇక నేను మోదీ పుట్టుకతోనే బీసీ కాదని మాత్రమే అన్నాను. ఆయన పుట్టుకతోనే బిసి కాదు కాబట్టే బిసిల పట్ల చిత్తశుద్ధి లేదు అని అన్నాను. నిజంగా ఆయనకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే జనగణనలో కులగణన కూడా చేయాలి' అని అన్నారు.



## కుంభమేళాకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం




తొలిఅడుగు, లక్నో : ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాలో శుక్రవారం రాత్రి బొలెరో వాహనం వేగంగా వస్తున్న బస్సును ఢీకొట్టడంతో బొలెరో లోని భక్తుల్లో పది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 19 మంది గాయపడ్డారు. మృతుల్లో ఈశ్వరీ ప్రసాద్ జైస్వాల్, సంతోష్ సోని, భాగీరథి జైస్వాల్, సోమనాథ్, అజయ్ బంజరే, సౌరభ్ కుమార్ సోని,గంగా దాస్ వర్మ, శివరాజ్‌పుత్, దీపక్‌వర్మ, రాజుసాహు ఉన్నారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ కోర్బా జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. ప్రయాగ్‌రాజ్ నుంచి మీర్జాపూర్ వెళ్లే హైవేపై ఈ ప్రమాదం జరిగింది. పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. భక్తులు మధ్యప్రదేశ్ లోని రాజ్‌గడ్ జిల్లాకు చెందిన వారు. వారణాసి వెళ్లడానికి సిద్ధమయ్యారు.

## విద్యార్ధులకు గుడ్‌న్యూస్ చెప్పిన కూటమి సర్కార్



2

### చిన్న చిన్న కళాశాలలను యూనివర్సిటీలుగా ఏర్పాటు చేయడానికి సన్నాహాలు

తొలిఅడుగు, అమరావతి : వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి సాంకేతిక విద్యాపరంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా మరో 20 కొత్త యూనివర్సిటీలు ఏర్పాటు చేయన్నట్లు జేఎన్‌టీయూ (కాకినాడ) ఉపకులపతి కేవిఎస్‌జీ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు కూటమి సర్కార్ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. గుంటూరు జిల్లా

## ఇప్పట్లో నూతన రేషన్ కార్డులు లేనట్లేనా



తొలిఅడుగు, హైదరాబాద్ : తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ ఇంకా కంటిన్యూ అవుతోంది. ఇప్పటిదాకా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కొత్త కార్డులు జారీ చేసిన సర్కారు.. నూతనంగా దరఖాస్తు చేసే చాన్స్ కూడా కల్పిస్తోంది. దీంతో మీ-సేవా కేంద్రాల దగ్గర భారీగా జనం బారులు తీరుతున్నారు. గత రెండ్రోజుల నుంచి మీ-సేవా సెంటర్ల దగ్గర భారీగా రద్దీ నెలకొంటోంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా కార్డు రాకపోవడంతో వాళ్లలో చాలా మంది మీ-సేవలో తిరిగి అప్లయ్ చేసుకుంటున్నారు. ఈ తరుణంలో కొత్త రేషన్ కార్డులపై బిగ్ అప్‌డేట్ వచ్చింది. ఇప్పట్లో నూతన రేషన్ కార్డులు లేనట్లేనని తెలుస్తోంది. దీనిపై మరిన్ని వివరాలు ఇప్పుడు చూద్దాం.. ప్రస్తుతం తెలంగాణలోని పలు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. మెదక్-

2

## తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నారు

తొలిఅడుగు, హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ప్రాధాన్యం ఇచ్చిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు ఇచ్చిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని రేవంత్ ప్రభుత్వానికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణలో జాతీయ రహదారుల కోసం లక్షా 20వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని అన్నారు. రూ. 80వేల కోట్ల పనులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. కేంద్రం నుంచి రీజనల్ రింగ్ రోడ్, మెగా టెక్స్ టైల్ పార్క్, రైల్వే కోచ్ తెచ్చామని ఉద్ఘాటించారు. ఇవాళ (శనివారం) నల్గొండలో కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

2



## వైసీపీ నేతలపై మంత్రి ఆగ్రహం



తొలిఅడుగు, కృష్ణా జిల్లా: కిడ్నాప్ కేసులో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత వల్లభనేని వంశీ అరెస్టుపై ఏపీ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలు రెచ్చిపోయారని లోకేశ్

2

## ఒక్కసారిగా 10 మంది కార్పొరేటర్లు జంప్

### మ్మెత్తం 13 మంది కౌన్సిలర్లు వైసీపీకి గుడ్ బై

తొలిఅడుగు, కాకినాడ : జిల్లాలో వైసీపీ కి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒక్కొక్కరిగా వైసీపీని వీడుతూ ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి షాక్ ఇస్తున్నారు. ఇప్పటికే తుని పట్టణానికి చెందిన ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరగా.. అదే పార్టీకి చెందిన మరో 10 మంది కౌన్సిలర్లు తాజాగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో మ్మెత్తం 13 మంది కౌన్సిలర్లు వైసీపీకి గుడ్ బై చెప్పినట్లు అయ్యింది. వీరందరికీ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



## కులం.. అభివృద్ధికి ఆటంకం

మొదటిపేజీ తరువాయి కోరిక రాజ్యాంగ విధానానికి వ్యతిరేకం. కులాన్ని కొనసాగించే దేనినీ న్యాయస్థానం పరిశీలించదు. కులం అనే అనవసరపు భారానికి సమాజంలో కొన్ని వర్గాలు ఇంకా వీటి కింద చావలేదు అంటూ హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది.

## వైసీపీ నేతలపై లోకేశ్ ఆగ్రహం

మండిపడ్డారు. ఇష్టమ్మొచ్చినట్లు వ్యవహరించి ప్రజలు, ప్రతిపక్ష నేతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ధ్వజమెత్తారు. విశాఖ పర్యటన ముగించుకుని గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న లోకేశ్ మీడియాతో మాట్లాడారు. 2019 -2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి పాలన జరిగిందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని మంత్రి లోకేశ్ అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రతిపక్ష నేతలు, ప్రజా నాయకులు వెళితే వారిని ఇబ్బందులకు గురి చేసి వేధించారని ఆగ్రహించారు.

అప్పటి ప్రతిపక్ష నేతైన చంద్రబాబు నాయుడిని సైతం బయటకు రానివ్వకుండా ఇంటి గేట్లను తాళ్లతో కట్టారని ఆరోపించారు. ప్రెస్ మీట్ పెట్టి వైసీపీ ప్రభుత్వాన్ని, జగన్ మోహన్ రెడ్డిని ప్రశ్నిస్తే కేసులు పెట్టారని మండిపడ్డారు. జగన్ సర్కార్‌లో మంగళగిరి, గన్నవరం టీడీపీ కార్యాలయాలపై దాడులు చేశారని ఆగ్రహించారు. ఓ ఎస్సీ వ్యక్తిని కిడ్నాప్ చేసి కేసు విత్ డ్రా చేయించిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే వంశీ అని లోకేశ్ మండిపడ్డారు. కిడ్నాప్ కేసు.. వల్లభనేని వంశీని జైలుకు పంపిందని చెప్పుకొచ్చారు. అన్ని విషయాలూ త్వరలో బయటకు వస్తాయని, న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలు, టీడీపీ కార్యకర్తలను వైసీపీ నేతలు, అధికారులు ఇబ్బంది పెట్టారని, వాళ్లపైనా న్యాయపరమైన చర్యలు ఉంటాయని మంత్రి హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని యువగళం సందర్భంగా 90 బహిరంగ సభల్లో రెడ్ బుక్ గురించి చెప్పినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు.

కాగా, గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో డీటీపీ ఆపరేషన్ సత్యవర్ధన్.. పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసును వెనక్కి తీసుకోవాలని వైసీపీ నేత వల్లభనేని వంశీ అతని అనుచరులు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేశారని ఆరోపణలు వచ్చాయి. కిడ్నాప్ ఘటనపై కేసు నమోదు చేసిన విజయవాడ పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. వల్లభనేని వంశీ, ఎలినేని రామకృష్ణ, లక్ష్మీపతి, వంశీబాబు, గంటా వీర్రాజును అరెస్టు కాగా.. వీరంతా ప్రస్తుతం రిమాండ్ ఖైదీలుగా జిల్లా జైలులో ఉన్నారు. మరోవైపు ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో 12 మంది కోసం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.

## విద్యార్థులకు గుడ్‌న్యూస్ చెప్పిన కూటమి సర్కార్

మండలం వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాలకు వచ్చిన ఆయన మాట్లాడుతూ.. ఇతర దేశాల్లో మాదిరిగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం చిన్న చిన్న కళాశాలలను యూనివర్సిటీలుగా ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తోందని చెప్పారు. ఇప్పటికే 3 ఇంజినీరింగ్ కాలేజీలను యూనివర్సిటీలుగా మార్చినట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో క్రీడల పరంగా 0.5 క్రెడిట్ అందించామని, ఇప్పుడు దాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇక అటు తెలంగాణ రాష్ట్రంలోనూ మరో రెండు అడ్వాన్స్‌డ్ మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్లు రానున్నాయి. ఈ మేరకు అనుమతి కోరుతూ వైద్య విద్య సంచాలకుల కార్యాలయం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం అనుమతిస్తే ప్రతి వైద్య కాలేజీలో మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఉంటుంది. విద్యార్థులకు వైద్య విద్య పాఠాలు చెప్పేందుకు అధ్యాపకులు ఇందులో ప్రాథమిక స్థాయి శిక్షణ పొందుతారు. దీంతోపాటు అధ్యాపకులు తప్పనిసరిగా అడ్వాన్స్‌డ్ శిక్షణ కూడా పొందాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఇలాంటివి రెండు సెంటర్లు ఉన్నాయి. ఒకటి హైదరాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాల కాగా, మరొకటి వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ).

ఈ రెండింటిలో మాత్రమే అడ్వాన్స్‌డ్ మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఉంది. రాష్ట్రంలో ఇటీవల కాలంలో వైద్య కళాశాలల సంఖ్య గణనీయంగా పెరగడంతో మరో 2 అడ్వాన్స్‌డ్ మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్లను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ మేరకు వీటిని నిజామాబాద్, మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించి, సర్కారుకు ప్రతిపాదనలు పంపారు. ఆమోదం లభించిన వెంటనే రెండు కేంద్రాలు నెలకొల్పనున్నట్టు అధికారులు వెల్లడించారు.

## ఇప్పట్లో నూతన రేషన్ కార్డులు లేనట్లేనా

మొదటిపేజీ తరువాయి నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ స్థానానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. అటు మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంగనర్‌లో టీచర్ ఎమ్మెల్సీకి నగారా మోగింది. ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనుంది. ఎన్నికల కారణంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. దీంతో ఇది ముగిసేవరకు రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోనుంది. గ్యాడ్యుయేట్, ఎమ్మెల్సీ ఎలక్షన్ ముగిశాకే నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ మొదలవనుందని తెలుస్తోంది. అయితే కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ మాత్రం కొనసాగుతుందని.. ఇది నిరంతర ప్రక్రియ అని, మీ–సేవా కేంద్రాల్లో అప్లయ్ చేసుకోవాలని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని అంటున్నారు.

## ఏఐపై వట్టి మాటలు కాదు, గట్టి చేతలు కావాలి

మొదటిపేజీ తరువాయి చేయడంలో యుద్ధభూమితో కమ్యూనికేట్ అవుతున్నాయి. డ్రోన్లు కేవలం సాంకేతికత మాత్రమే కాదు.. బలమైన పారిశ్రామిక వ్యవస్థతో ఉత్పత్తి చేసిన ఆవిష్కరణలు. దీనిని గ్రహించడంలో ప్రధానమంత్రి మోదీ విఫలమయ్యారు. ఏఐపై ఆయన ప్రసంగాలకే పరిమితమవుతుంటే మన పోటీ దేశాలు మాత్రం కొత్త సాంకేతికతను సృష్టించి రాటుదేలుతున్నాయి. కొత్త సాంకేతికను అందిపుచ్చుకునేందుకు మనకు బలమైన పునాది కావాలి. వట్టి మాటలు కాదు” అని రాహుల్ అన్నారు. దేశంలో ప్రతిభ కలిగిన ఇంజనీరింగ్ వ్యవస్థ ఉన్నప్పటికీ అత్యాధునిక సాంకేతికతను అభివృద్ధి చేయడంలో మనం విఫలమవుతున్నామని రాహుల్ అన్నారు. ఈ దిశగా ఒక స్పష్టమైన వ్యూహం అవసరమని, యువతకు ఉద్యోగాలు ఇవ్వడం, దేశాన్ని ముందుకు నడిపేందుకు దృఢమైన పారిశ్రామిక నైపుణ్యం అవసరమని సూచించారు.

రాహుల్ గాంధీ ఇటీవల లోక్‌సభ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా కూడా ఉత్పత్తి రంగంలో భారత్ నిలదొక్కుకోలేకపోయిందని అన్నారు. అందువల్లే చైనా ఇక్కడ మకాం వేసిందని అన్నారు. ఇప్పటికైనా తయారీ రంగంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సి ఉందని సూచించారు. ‘మేక్ ఇన్ ఇండియా’ ఐడియా మంచిదే అయినా దాని ఫలితం కళ్లముందే ఉందన్నారు. 2014లో జీడీపీలో 15.3 శాతంగా ఉన్న మ్యాన్యుఫ్యాక్చరింగ్.. ఇవాళ 12.6 శాతంగా ఉందని, గత 60 ఏళ్లలో ఇది అత్యంత కనిష్టమని చెప్పారు. ప్రధానమంత్రిని తాను తప్పుపట్టడం లేదని, ఆయన ప్రయత్నించడం లేదని కూడా చెప్పనని, ఆయన ప్రయత్నించినా విఫలమయ్యారని చెప్పగలనని అన్నారు. “మొబిలిటీలో మార్పులకు నాలుగు టెక్నాలజీలు ప్రధానం. ఎలక్ట్రిక్ మోటార్స్, బ్యాటరీస్, ఆప్టిక్స్, వాటన్నింటికంటే టాప్‌లో ఏఐ ఉంటాయన్నారు. ఏఐ గురించి మాట్లాడేటప్పుడు అది సొంత ఏఐ కాకపోతే దానికి అర్థం లేదు. ఎందుకంటే అది డాటాపై ఆపరేట్ అవుతుంది. ఇవాళ మనం డాటాను చూస్తే, ప్రొడక్షన్ సిస్టమ్ నుంచి వచ్చే ప్రతి సింగిల్ డాటా చైనాదే” అని రాహుల్ అన్నారు.

## కంపెనీలను వదలని సైబర్ నేరగాళ్లు

మొదటిపేజీ తరువాయి కేటుగాళ్లు. ప్రముఖ మేఘా కంపెనీ సైబర్ నేరగాళ్ల మోసానికి బలైంది. నకిలీ ఈమెయిల్ ద్వారా దాదాపు రూ.5 కోట్ల 47 లక్షలు కొట్టేశారు సైబర్ నేరగాళ్లు. ఈ విషయాన్ని గుర్తించిన సదరు కంపెనీ... తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోను ఆశ్రయించింది. సైబర్ మోసంపై మేఘా సంస్థ అకౌంట్ మేనేజర్ శ్రీహరి... సైబర్ సెక్యూరిటీ బ్యూరోకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

మేఘా కంపెనీకి అవసరమైన ఎక్విమెంట్‌ను నెదర్లాండ్స్‌కు చెందిన కంపెనీకి ఆర్డర్స్ ఇచ్చారు. ఆ కంపెనీకి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లింపులు చేశారు. చెల్లింపుల తర్వాత ప్రతిసారి కన్ఫర్మేషన్ మెయిల్ వచ్చేది. ఇక్కడే సైబర్ నేరగాళ్లు ఆ కంపెనీ లాగానే ఈ మెయిల్‌లో ఒక అక్షరం మార్చి మెయిల్ చేశారు. కొన్ని కారణాల వల్ల మీరు పంపించే అకౌంట్ పనిచేయడం లేదు. మరో అకౌంట్‌కు డబ్బులు చెల్లించాలంటూ మేఘా కంపెనీకి మెయిల్ పంపించారు. అది నిజమని నమ్మి దాదాపు రూ.5 కోట్ల 47 లక్షలు రెండు విడతలుగా చెల్లించారు కంపెనీ ప్రతినిధులు. అయితే అదే కంపెనీ నుంచి డబ్బులు చెల్లించలేదని మరో మెయిల్ వచ్చింది. దీంతో మోసపోయామని గ్రహించిన మేఘా కంపెనీ.. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఫిర్యాదు చేశారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నారు

మొదటిపేజీ తరువాయి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులి సరోత్తమ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మూడు ఎన్నికల్లోనూ పోటీ చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమే అని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల అకాంక్షల కోసం బీజేపీ పనిచేస్తుందని అన్నారు. రూ. 7వేల కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి చేసే పరిశ్రమ ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భూమి పూజ చేశారని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఎరువులకు సబ్సిడీ ఇస్తూ రైతులను బీజేపీ ఆదుకుంటుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు కేంద్రం ఏం ఇచ్చిందని అడగడం ఫ్యాషన్‌గా మారిందని విమర్శించారు. 2014 మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను పూర్తిగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే దివాలా తీయించామని ఆరోపించారు. 11 ఏళ్లలో రూ.10 లక్షల కోట్లు రెండు పార్టీలు కలిసి అప్పులు చేశాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. అద్భుతమైన తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## ఒక్కసారిగా 10 మంది కార్పొరేటర్లు జంప్

మొదటిపేజీ తరువాయి త్వరలో తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఒక్కసారిగా ఇంత మంది ఫ్యాన్ పార్టీని వీడడంపై జిల్లాలో ఇప్పుడు పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. జిల్లాకు చెందిన మరికొంతమంది ముఖ్య నేతలు సైతం కూటమిలోని ఏదో ఒక పార్టీలో చేరేందుకు చూస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, గతేడాది జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైన సంగతి తెలిసిందే. అప్పట్నుంచి వైఎస్ జగన్ తాడేపల్లి ప్యాలెస్?కు పరిమితం అయ్యారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీ శ్రేణులు కూటమి వైపు చూస్తున్నారు. మరోవైపు ఎన్నికల్లో ఘోర ఓటమి, జగన్ తీరుపైనా నేతలు, కార్యకర్తల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిపోతోంది. దీంతో చాలా మంది నేతలు ఆయనకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల గురువారం రోజున ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని సైతం టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఆళ్ల నానికి టీడీపీ కండువా కప్పిన సీఎం చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. ఏలూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఉన్న ఆయన మూడు నెలల క్రితమే వైసీపీకి రాజీనామా చేసి తాజాగా టీడీపీ గూటికి చేరారు.

## ఘనంగా బంజారా సంత్ సేవాలాల్ జయంతోత్సవాలు



తొలిఅడుగు డెస్క్ : బంజారా సంత్ శ్రీ సేవాలాల్ జయంతి రాష్ట్రస్థాయి ఉత్సవాలు హైదరాబాద్ లోని బంజారాహిల్స్ లో ఉన్న సేవాలాల్ బంజారా భవన్లో ఘనంగా జరిగాయి. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన భోగ్ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొని భోగ కుండ్ లో నెయ్యి, పవిత్ర ద్రవ్యాలు సమర్పించి, సేవాలాల్ విగ్రహానికి పూల మాలలు వేసి ఉత్సవాలకు విచ్చేసిన వేలాది మంది లంబాడీ గిరిజన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవాలకు అతిథులుగా విచ్చేసిన మంత్రివర్యులు భట్టి విక్రమార్క, డా. ధనసరి అనసూయ సీతక్క, ఎంపీలు బలరాం నాయక్, అనిల్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు బాలు నాయక్, విప్ రాంచందర్, ప్రజా ప్రతినిధులు రాందాస్ నాయక్, రవీందర్ నాయక్, కార్పొరేటర్ విజయారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులను గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ డా. ఎ. శరత్ గారి ఆధ్వర్యంలో అధికారులు, లంబాడీ కళాకారుల బృందాలు కళా ప్రదర్శనలతో ఆహ్వానించారు. అందరూ సేవాలాల్ విగ్రహం ముందు నంగారాలను మోగించి, భోగ్ సమర్పించి పూలు అర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పంచాయితీరాజ్ శాఖామాత్యులు డా. ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ సేవాలాల్ చరిత్రను భావితరాలకు అందించడమే ఆ మహానుభావునికి మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. గిరిజన సాంస్కృతిక మూలాలను కనీసం సందర్భోచితంగానైనా ప్రదర్శించి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజనులు తమ ఇళ్ళల్లోనైనా తమ తమ మాతృ భాషలను మాట్లాడుతూ తమ తమ అస్తిత్వాలను కాపాడుకోవాలన్నారు. గిరిజన సమాజ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో వక్తలు ప్రస్తావించినట్లుగా వచ్చే సంవత్సరం ఎల్బీ స్టేడియం వంటి విశాలమైన స్థలంలో సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించే అంశం, భారత రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూల్లో బంజారా భాషను చేర్చే అంశం ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్ళి సానుకూల నిర్ణయాలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా బంజారా గురువులు, బంజారా గాయని రోహిణి, క్రికెటర్ కావ్యశ్రీ, పర్వతారోహకులు మోతె రాందాస్, భూక్యా యశ్వంత్, ఎంబ్రాయిడరీ కళాకారుడు బని నవీన్ లను సన్మానించారు. కార్యక్రమానికి గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి డా.ఎ.శరత్ అధ్యక్షత వహించారు. గిరిజన తెగల జాతీయ సంఘం సభ్యులు శ్రీ హుస్సేన్ నాయక్, ట్రైకార్ చైర్మన్ శ్రీ బెల్లయ్య నాయక్, మాజీ ఎంపీ వి. హన్మంతరావు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బంజారా కళాకారులు, ప్రజా ప్రతినిధులు, మేధావులు, బంజారా సంఘాల సభ్యులు, వేలాది మంది ప్రజలు, విద్యార్థులు, గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకులు శ్రీ వి. సర్వేశ్వర్ రెడ్డి, టిసిఆర్ %డ% టీఐ సంచాలకులు డా.వి. సముజ్వల, చీఫ్ ఇంజనీర్ శ్రీ శంకర్, జీసీసీ జీఎం శ్రీ వి. సీతారామ్, ట్రైకార్ జీఎం శ్రీ శంకర్ రావు, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్
తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# నిరుపేద కుటుంబనికి బియ్యం అందజేసిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్



తొలిఅడుగు, చిన్నకోడూరు, ఫిబ్రవరి 15 : చిన్నకోడూరు మండల కేంద్రం లో ఇటీవల అనారోగ్యం తో మరణించిన మనుక చెంద్రయ్య గారి కుటుంబనికి కాంగ్రెస్ మండల అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ 50 కిలోల బియ్యన్ని అందజేశారు ఈ కార్యక్రమం లో మండల ఉప అధ్యక్షులు సందబోయిన పర్శరాం, సెక్రటరీ కోరిమి రాజు,కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి పాకాల భూపతి రెడ్డి యూత్ కాంగ్రెస్ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని గణేష్, %ంఎ% సెల్ నాయకులు మిట్టపల్లి కనకరాజు,నాయకులు నక్క రాజు, లెంకలపల్లి భాస్కర్,మహేష్,మల్కా మహేందర్ రెడ్డి, బంక నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గుండ్రాతి లింగం గౌడ్ కి నియామక పత్రం అందజేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య



తొలి అడుగు, కల్వకుర్తి ఫిబ్రవరి 15 : కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలానికి చెందిన గుండ్రాతి లింగం గౌడ్ కు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుండ్రాతి లింగం గౌడ్ ను నియమించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బీసీల ఐక్యత కోసం బీసీల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా బీసీల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ రావలసిన బీసీల వాటా కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని అదేవిధంగా బీసీ సంఘాన్ని మరింత పటిష్టంగా ఉండడానికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ యొక్క సంఘంలో సభ్యులుగా చేరి సంఘం పురోగతికి అందరూ సహకరించాలని రాబోయే స్థానిక ఎన్నికల్లో మన సత్తా ఏమిటో చూపించాలని ఆర్ కృష్ణయ్య ప్రతి ఒక్క బీసీ బిడ్డను కోరినారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి చెరుకు మనికంట, ఇనుగంటి రాజు నేత, చెరుకుల రాజేందర్, సురేష్ యాదవ్, భాస్కర్ మరియు బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# మాపై పెట్టిన కేసులు ఉపసంహరించకపోతే నిరవధిక నిరాహార దీక్షలు చేస్తాం

– పీడీఎస్ యు మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఈపిచర్ల భూషణం



తొలి అడుగు, జంగారెడ్డిగూడెం ఫిబ్రవరి 15 : జంగారెడ్డిగూడెం మండలం అక్కంపేట గ్రామంలో జరిగిన సమావేశంలో పిడిఎస్యు మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఈపిచర్ల భూషణం మాట్లాడుతూ మా మీద పెట్టిన కేసులు ఉపసంహరించకపోతే కుటుంబం మొత్తం కలిపి నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని తెలియజేశారు. ఈరోజు పేపర్లో నాపై మరి కొంతమంది ప్రభుత్వాధికారులపై కేసు రిజిస్టర్ అయినట్టుగా పేపర్లో వచ్చింది ఇది చూసి మా కుటుంబ ఆశ్చర్యపోయాం గత మూడు సంవత్సరాల కు మా ఇంటి వద్ద సరిహద్దు వివాదం కొనసాగుతుందని. మా ఇంటి పక్కన ఉన్న వాసిరెడ్డి దుర్గమ్మ అనే ఆమె నిత్యం మాపై గొడవలు పడుతూ బూతులు తిడుతుండేదని మేము నడిచే దారిని తన పట్టా భూమిని ఆ దారికి అడ్డం గా నీకు ఆటంకాలు సృష్టించేవారు దీనిపై గతంలో ఆర్డీవో మరియు జిల్లా కలెక్టర్ మరియు పోలీస్ అధికారులు తదితరు అధికారులు అందరికీ తెలియజేశారు దానిపై స్పందించిన అప్పటి ఆర్డీవో ఝాన్సీ రాణి గారు. ఆ దారిలో అడ్డంగా ఉన్న వాటిని తొలగించి మాకు దారి ఇచ్చారు అని, దీనిపై మమ్ములను కులం పేరు దూషించినందుకు కేసు కూడా నడుస్తున్న నడుస్తున్నదని, అయితే మళ్లీ అదే దారిలో సిమెంట్ దిమ్మలు కర్రలు కోళ్లగాపులు దారికి అడ్డంగా వేశారని, అయితే ఈ విషయమై మరలా మేము స్పందనలో జనవరి 28 అధికారులను నిర్ణయించుకున్నామని చెప్పారు. దీనిపై స్పందించిన అధికారులు ఆ పంచాయతీ రహదారులు అడ్డంకులు తొలగించాలని కింది అధికారులకు తెలియజేశారు. దీని ప్రకారం ఏంది అధికారులు 11. 2. 2025న మా ఇంటికి వచ్చి నాకు ఫోన్ చేశారని, నేను ఆరోజు ఆదివాసి సంఘాలు ఏజెన్సీ బందుకు పిలుపునిచ్చినందున ఆ బందును మా సంఘం బలపరిచిన నేను జీలకర్ర బందులో పాల్గొని ఉన్నానని తెలియజేశారు. అయితే ఆ దహ రహదారిలో ఉన్న అడ్డంకులను వారు తొలగించి నాకు ఫోన్ చేసి దారి క్లియర్ చేశామని తెలియజేశారు. నేను సంతోషం వ్యక్తం చేశాను కానీ అదే రోజు ఆవిడ పై నేను ప్రభుత్వ అధికారులు దాడి చేసినట్టుగా రిపోర్ట్ ఇచ్చిందని, దానిపై స్థానిక ఎస్సై గారు సరైన విచారణ జరపకుండా ఎఫ్ ఐ ఆర్ కట్టడం చాలా విచారించదగిన విషయం అని స్పందన కార్యక్రమాన్ని కూడా ఎస్సై గారు దృష్టికి వచ్చిందో లేదో గాని చరణ్ చేయకుండా కేసు నమోదు చేయడం సరే అనేది కాదు అని, ఇప్పటికైనా మా రహదారిని మాకు అప్పగించి మా మీద పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని కోరుచున్నామని, లేనియెడల నేను నా భార్య పిల్లలు మా అమ్మ కలిసి ఆర్టీవో కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని తెలియజేశారు. ఇదే విషయంపై సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కె.వి.రమణ ఐ ఎఫ్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు రామ్మోహన్ లు మాట్లాడుతూ ఈ సమస్య పరిష్కారం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలియజేశారు.

# తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎస్ ఎస్ సి టాలెంట్ టెస్ట్



తొలి అడుగు, కల్వకుర్తి, ఫిబ్రవరి 15: ఆమనగల్ పట్టణంలో వాసవి ఫంక్షన్ హాల్ లో తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాపిశెట్టి రాము గారు హాజరై ప్రశ్నాపత్రాలు విడుదల చేసి విద్యార్థులకు అందించడం జరిగింది అనంతరం ఆయన మాట్లాడుతూ టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీయడానికి దోహదపడుతుందని భవిష్యత్తులో ఇది వారికి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ కర్రే సుదర్శన్, తెలంగాణ యూనియన్ ఫిలిం డాన్సర్ ప్రభుశంకర్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పిప్పళ్ళ శివశంకర్, ఎవీ. శర్మ,శివలింగం, శ్రీరామ్, నరేష్, శ్రీశైలం మీసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జి బిఎస్ కేసులు లేవు అయినా అప్రమత్తం అవసరం

– ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్



తొలి అడుగు, జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 15 : జిపిఎస్ వ్యాధికి సంబంధించిన కేసులు ఏవి నమోదు కాలేదని, అయినా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఏరియా ఆసుపత్రి వైద్యులను పిహెచ్సి వైద్యులను ఎంపీడీవో లను సంబంధిత మున్సిపల్ కమిషనర్లను ఎమ్మెల్యే రోషన్ అప్రమత్తం చేశారు. శనివారం క్యాంప్ కార్యాలయం నుండి జూమ్ కంపెనీస్ నిర్వహించారు. అధికారుల అప్రమత్తంగా ఉండాలని మరియు బర్డు ఫ్లూ వ్యాధులు ప్రబలకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. రక్షిత నేతి సరఫరా పరిశీలన పరిశుభ్రత హర్షిత ఆహారం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రమాద పరిస్థితులు రాకముందే సమన్వయంతో అధికారులు అందరూ సమిష్టిగా పని చేయాలని ఆయన ఆదేశించారు. ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై మైకింగ్ ద్వారా విస్తృత ప్రచారం చేయాలని అధికారులు ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్లు క్షేత్ర సాయి సర్వేలు చేపట్టాలని వైద్యులను ఆదేశించారు. కాజా పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే రోషన్ కుమార్ పేర్కొన్నారు.

# ఆర్బీఐ కీలక నిర్ణయం

తొలి అడుగు, : బ్యాంకింగ్ రంగంలో సైబర్ మోసాలను అరికట్టేందుకు ఆర్బీఐ చర్యలు చేపడుతూనే ఉంది. ఇప్పుడు ఆర్బీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. టెక్నాలజీ పెరిగేకొద్ది రకరకాల మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆర్థికపరమైన మోసాలను అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్థిక సేవల కోసం డిజిటలైజేషన్ మరింత వేగవంతమైంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు టెక్నాలజీని మరింత అభివృద్ధి అవుతోంది. అయితే టెక్నాలజీ పెరిగే కొద్ది సైబర్ మోసాలు కూడా అంతే జరుగుతున్నాయి. ఎంతో మంది డిజిటల్ మోసాలకు గురవుతున్నారు. అయితే ఈ బ్యాంకింగ్ రంగంలో సైబర్ మోసాలను అరికట్టేందుకు ఆర్బీఐ చర్యలు చేపడుతూనే ఉంది. ఇప్పుడు ఆర్బీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ భారతీయ బ్యాంకుల కోసం ప్రత్యేకమైన ఝఅని.ఱఅ డొమైన్‌ను ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ భద్రతను మెరుగుపరచడం, ఫిషింగ్ దాడులను తగ్గించడం, డిజిటల్ బ్యాంకింగ్, చెల్లింపు వ్యవస్థలను మరింత బలోపేతం చేయనుంది.

## జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో జీబీ సిండ్రోమ్ కొరకు ప్రత్యేక ఐసోలేషన్



తొలిడుగు, జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 15 : చింతలపూడి గౌరవ శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ ఆదేశాల మేరకు రాష్ట్ర లోను జీబీ సింద్రోమ్ అనుమానిత కేసుల నియంత్రణలో భాగంగా, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో జీబీ సింద్రోమ్ అనుమానిత కేసుల కోసం ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డును సిద్ధం చేయడం జరిగిందని, కండరాల బలహీనత జ్వరం వంటి లక్షణాలున్న వ్యక్తులు ఏరియా ఆసుపత్రిని సంప్రదించాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, బయట ఆహార పదార్థాలను కొన్ని రోజులపాటు పూర్తిగా దూరం పెట్టాలని ప్రతిసారి చేతులను శుభ్రం కడుపు శుభ్రం చేసుకోవాలని, ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ బేబీ కమల అన్నారు. వాటర్ ట్యాంకులను, ఆస్పత్రి పరిసరాలను ఈ సందర్భంగా శుభ్రం చేయడం జరిగిందని వివరించారు.

## ఎమ్మెల్సీ రాజశేఖర్ గెలుపునకు సహకరించండి

**- శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్**




తొలిఅడుగు, జంగారెడ్డిగూడెం ఫిబ్రవరి 15 : చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఉపాధ్యాయులతో సమావేశమైన శాసనసభ్యులు మరియు కూటమి నాయకులు, ఉమ్మడి పశ్చిమ తూర్పుగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు 27వ తేదీన జరగను నేపథ్యంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి అయిన ఏరా బత్తుల రాజశేఖర్ గెలుపునకు ఉపాధ్యాయులు అందరూ సహకరించాలని చింతలపూడి శాసనసభ్యులు కోరారు. చింతలపూడి పట్టణంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కోటమీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఉభయగోదావరి జిల్లాల అభ్యర్థిగా పోటీ చేస్తున్న సందర్భంగా ఉపాధ్యాయులు అందరూ కూడా బ్యాలెట్ పేపర్లు అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న కాళీ గడిలో ఒకటో నెంబర్ ఓటు వేసి పేరా బత్తుల రాజశేఖరు గెలుపునకు సహకరించాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకులు మరియు మాజీ ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి మాట్లాడుతూ ఈనెల 27వ తారీఖున జరగనున్న నేపథ్యంలో చింతలపూడి శాసనసభ్యులు సోమవారం రోషన్ కుమార్ గారు నిరంతరం నాలుగు మండలాల నాయకులతో సమావేశం నిర్వహిస్తూ నియోజకవర్గంలో భారీ మెజార్టీ ఇచ్చే దిశగాఅడుగులు వేస్తున్నారని మీరందరూ కూడా భారీ మెజారిటీతో మెజార్టీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు సీతారాల మధుబాబు బిజెపి మండల అధ్యక్షులు టీవీ నారాయణ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వేచ్ఛ ఆంధ్ర - స్వేచ్ఛ దివాస్




తొలిడుగు, జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 15 : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈరోజు జంగారెడ్డిగూడెం పురపాలక సంఘంలోని శ్రీ అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్కు నందు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం జరిగే స్వేచ్ఛ ఆంధ్ర స్వేచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని, అదేవిధంగా సోర్స్ రిసోర్స్ అనే కార్యక్రమం పురపాలక సంఘములోని 10 సచివాలయాల పరిధిలో నిర్వహించడం జరిగింది. ప్రజలు ఇంటివద్ద చెత్తను తడి చెత్త పొడి చెత్త హానికరమైన చెత్తగా వేరు చేసిన పారిశుద్ధ కార్మికులకు ఇవ్వవలసినదిగా, అలాగే ఇంటి వద్ద స్థలము ఉన్నవారు హెూం కంపోస్టుగా మార్చాలని తెలియజేయడం జరిగినది అని, అలాగే చెత్తను వేరే చేయడం వల్ల కలిగే లాభాలు ను వివరించడం జరిగినదిని భూ కాలుష్యము, నీటి కాలుష్యము జల కాలుష్యము కాకుండా ఉండాలంటే శాస్త్రీయ పద్ధతిలో చెత్తను ఎరువుగా రీసైక్లింగ్ రిక్యూస్ రెడ్యూస్ చేయాలని ప్రజలకు అవగాహన జరిగినదని, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరమణ తాసిల్దార్ స్లీవ జోజి, సానిటరీ ఇన్స్పెక్టర్, పారిశుద్ధ కార్మికులు, మున్సిపల్ సిబ్బంది ఆర్పీలు సచివాలయ సెక్రటరీ ప్రజలు పాల్గొన్నారు.

## మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో ఉత్సవమూర్తికి పంచామృత అభిషేకం





తొలి అడుగు, జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 15 : ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం, గురవాయి గూడెం గ్రామం నందు తెల్ల మద్ది చెట్టు క్రింద స్వయంబులై వెలసిన శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద ఈరోజు శనివారం సందర్భంగా ఆలయ ముఖమండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రష్టకంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. సదరు కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద దాతలసే నిర్మించబడుతున్న వసతి గదుల కు హైదరాబాదుకు చెందిన మహేంద్ర లత దంపతులు 10 లక్షలు విరాళముగా ఇచ్చారు, ఆలయము వద్ద అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. శ్రీ స్వామివారి దర్శనముకు విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ పర్యవేక్షకులు జవాది కృష్ణ, కొరగంటి రంగారావు, పర్యవేక్షణలో తగిన ఏర్పాట్లు గావించినట్లు, ఆలయ కార్య నిర్వహణ అధికారిని ఆర్.వి చందన తెలిపారు.

## దమ్ము ఉంటే ప్రజా సమక్షంలో నిరూపించుకుందాం

**- కాంగ్రెస్ అవినీతి ఆరోపణల్లో వాస్తవం లేదు**
**- టేక్మల్ సొసైటీ ఛైర్మన్ యశ్వంత్ రెడ్డి**



తొలి అడుగు, టేక్మాల్, ఫిబ్రవరి 15 : కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నట్లుగా సొసైటీలో ఎలాంటి అవినీతి జరగలేదని, తనపై చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ దురుద్దేశ్యంతో చేస్తున్నవేనని టేక్మాల్ పీఏసీఎస్ ఛైర్మన్ యశ్వంత్ రెడ్డి పేర్కొన్నారు. సొసైటీలో రూ.23,34,933 అవినీతి జరిగిందని, అట్టి డబ్బును రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారని, అవినీతికి పాల్పడిన ఛైర్మన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఛైర్మన్ యశ్వంత్ రెడ్డి, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వీరప్ప, పార్టీ నాయకులు శనివారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నట్లు సొసైటీలో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన రూ.11,46,325 అవినీతి జరిగినట్లుగా చెప్పిందంట్లో ఏ మాత్రం నిజం లేదన్నారు. సొసైటీకి సంబంధించిన పాత గోదాం రిపేరు, ప్రహరిగోడ నిర్మాణం, సీసీ, నీటి సౌకర్యం కోసం వేసిన బోరు ఖర్చులను కొత్తగా నిర్మించిన భవనానికి సంబంధించిన బిల్లుల్లో విచారణ అధికారులు చూపడం వల్లనే ఈ తేడా ఉందన్నారు. 2019లో పెట్రోల్ బంకు ఏర్పాటు కోసం తీర్మానం చేయడం జరిగిందని, 2020లో బంకు ప్రారంభించినట్లు చెప్పారు. పెట్రోల్ బంకు నిర్మాణం కోసం అయిన ఖర్చును ఎంబి ప్రకారమే బిల్లులు తీసుకోవడం జరిగిందన్నారు. అయితే బంకు నిర్మాణం పూర్తి చేసి, పెట్రోల్ తెచ్చినప్పటికి అమ్మకానికి అనుమతికి 18నెలలు ఆలస్యం కావడం, అదే సమయంలో పెట్రోల్ ధర తగ్గడం వల్ల వ్యత్యాసం వచ్చిందన్నారు. పెట్రోల్ బంకు నిర్వహణ అధికారులకు సంబంధించినది. పెట్రోలు ఎంత కొనుగోలు చేశారు, ఎంత అమ్మకం జరిగింది, మిగులు ఉన్న పెట్రోల్ ఎంతా అనేది పూర్తిగా లెక్కలు చూడకుండానే రూ.5,14,167 అక్రమాలు జరిగాయని చెప్పడం సరికాదన్నారు. రుణాలు ఇచ్చినప్పుడు రైతుల నుంచి షేర్ అమౌంట్ తీసుకునేది బ్యాంకు. దీనికి ఛైర్మన్ కు ఏమీ సంబంధం లేదు. రైతుల నుంచి 10శాతం కంటే ఎక్కువగా షేర్ అమౌంట్ తీసుకుంటున్న విషయం నాకు తెలియదన్నారు. కేవలం రాజకీయ దురుద్వేశ్యంతో చేస్తున్న ఆరోపణలు తప్ప ఇందులో ఏమాత్రం నిజం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరితే అవినీతి విచారణ ఉండదని, పార్టీలో చేరాలని తనపై ఎంతటి ఒత్తిడి చేసిన తాను పార్టీ మారే ప్రసక్తే లేదన్నారు. తాను కాంగ్రెస్ ఉన్న సమయంలో కనిపించని అవినీతి, బిఆర్ఎస్ లో చేరాక, అది కూడ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలిసిందా అన్నారు. రైతుల సమక్షంలో బహిరంగ సమావేశం నిర్వహించి అవినీతిపై చర్చిద్దామన్నారు. విచారణ పూర్తి స్థాయిలో లేదని, అసంపూర్తిగా ఉందన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తూ అభివృద్ధి పథంలో ఉన్న సొసైటీలో విచారణ పేరిట రైతులకు లోన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ ఆగం చేసిందన్నారు. జిల్లాలోని సొసైటీలన్ని రూ.5లక్షల వ్యవయంతో భవనం కడితే గతంలో ఉన్న సొసైటీ ఛైర్మన్, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రూ.6.32లక్షల వ్యయంతో భవనం కట్టారని చెప్పారు. జిల్లాలో అంతట రూ.5లక్షలు ఐతే టేక్మాల్ లో మాత్రం రూ.6.32లక్షలు తీసుకున్నవాళ్లు అవినీతి గురించి మాట్లాడటమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిక అధికారులపై ఒత్తిడి తెచ్చి చేయించనట్లుగా విచారణ ఉందని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప అన్నారు. పొంతన లేదని విధంగా ఉన్న రికవరీ ఉత్తర్వులే ఇందుకు నిదర్శనమన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి అవినీతి ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# సంపాదకీయం

మోడీ పాలనతో దేశప్రతిష్ట మసకబారిందా?

నరేంద్ర మోడీని డోనాల్డ్ ట్రంప్ మరోసారి ఆలింగనాలతో ముంచి తేల్చవచ్చు తప్ప అతగాడి అంతరంగం బయటపడకుండా ఉంటుందా! మన దేశమన్నా, మన పౌరులన్నా విద్వేషం వెళ్లగక్కేవారు అమెరికాలో ఎందరో! వారిలో ఒకడైన మార్కో ఎలెజ్ (25) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అమెరికా మీడియాను ఆకర్షించాడు. సామాజిక మాధ్యమంలో అతగాడు పెట్టిన పోస్టులలో "భారతీయుల మీద విద్వేషాన్ని సాధారణీకరించండి" అన్నది ఒకటి. శ్వేతజాతి దురహంకారులు ఇలాంటి పోస్టులు పెట్టటం సర్వసాధారణం, ప్రతిదాన్నీ పట్టించుకోనవసరం లేదు. మరి మార్కో ప్రత్యేకత ఏమిటి? అమెరికా అసలైన అధ్యక్షుడిగా అధికారం చెలాయిస్తున్న ఎలన్ మస్క్, ఆంధ్రా అల్లుడు అంటూ మన జనాలు పొంగిపోయిన ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్, చివరిగా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అందరూ అతడిని సమర్ధించారు. ఉద్యోగానికి రాజీనామా చేసి ఇంటికి పోతే పిలిచి తిరిగి ఇవ్వాలని చెప్పారు. కొద్ది రోజుల్లో భారత ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటనకు వస్తున్నారని వారికి తెలుసు, అయినా భారత్ మీద విద్వేషం వెళ్లగక్కిన వాడిని సమర్ధించటం ఏమిటి? ఇకపోతే, మార్కోను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలా వద్దా అన్న సర్వేలో పాల్గొన్న వేలాది మందిలో 78 శాతం అనుకూలంగా ఓటు వేసినట్లు తెలిసింది. గత పదకొండు సంవత్సరాలుగా నరేంద్ర మోడీ అమెరికా నేతలతో రాసుకు పూసుకు తిరిగి మన దేశ ప్రతిష్ట, పలుకుబడిని పెంచినట్లు ఊదరగొట్టిన తరువాత అమెరికాలో మన దేశం పట్ల వెల్లడైన తీరు ఇది. ఈ పరిణామం మీద ఆత్మగౌరవం గురించి కబుర్లు చెప్పే కాషాయ దళాలుగానీ, కేంద్ర ప్రభుత్వం గానీ నోరు మెదపలేదు. దీన్ని లొంగుబాటు అనాలా? మార్కో ఎలెజ్ ఉదంతాన్ని అమెరికాలోని భారతీయ సంతతి వారు జీర్ణించుకోలేకపోతున్నారు. పుండు మీద కారం చల్లినట్లుగా ఎలెజ్‌ను సమర్ధించటంతో మండిపడుతున్నారు. జె.డి వాన్స్ భార్య భారతీయ సంతతికి చెందిన చిలుకూరి ఉష. అందుకే కొందరు జె.డి వాన్స్‌ను ఆంధ్రా అల్లుడని కూడా వర్ణించారు. తనను, భార్యను కూడా తూలనాడినప్పటికీ ఆ పెద్దమనిషి ఎలెజ్‌ను పల్లెత్తుమాట అనకపోగా విమర్శకులు తనను భావోద్వేగాలతో బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఎదురుదాడి చేశాడు. రిపబ్లికన్ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుడు రో ఖన్నా అమెరికన్ ఇండియన్. ఎలెజ్‌ను తిరిగి తీసుకొనే ముందు అతడి చేత క్షమాపణ చెప్పిస్తావా? ఇది మన బిడ్డల కోసం అని వ్యాఖ్యానించాడు. వాన్స్ కబుర్లు చెప్పటం సరే, రోజంతా ఆయన బిడ్డలకు భద్రత ఉంటుంది. ఇంటర్నెట్‌లో వేధింపులకు గురయ్యే అవకాశం ఉన్న భారతీయుల పిల్లల సంగతేమిటి? అంటూ అనేక మంది ప్రశ్నించారు. మార్కో ఎలెజ్‌ను పిలిచి మరీ ఉద్యోగమివ్వటం అంటే జాత్యహంకార, భారత్ వ్యతిరేక శక్తులను బహిరంగంగా ప్రోత్సహించటం తప్ప మరొకటి కాదు. గాయపడిన భారతీయుల మనోభావాలను నరేంద్ర మోడీ పరిగణనలోకి తీసుకుంటారా? డోనాల్డ్ ట్రంప్‌తో ఆలింగనాల్లో అన్నీ మరచిపోతారా? అమెరికాకు అక్రమంగా వలస వచ్చిన వారిని వెతికి పట్టుకొని వారి దేశాలకు బలవంతంగా పంపటం ఇప్పటికే ప్రారంభమైంది. నిజానికి ఇది కొత్తేమీ కాదు, గతేడాది అక్రమంగా వలస వచ్చిన 90 వేల మంది భారతీయులను అరెస్టు చేసినట్లు వార్తలు వచ్చాయి. 2022 నాటి సమాచారం ప్రకారం అక్కడ కోటీ పది లక్షల మంది అక్రమ వలసదారులు ఉన్నారు. వారిలో 48 లక్షల మంది పక్కనే ఉన్న మెక్సికో వారే. మూడింట రెండు వంతుల మంది మెక్సికో, లాటిన్ అమెరికా దేశాల వారే ఉన్నారు. ఎల్ సాల్వడార్ నుంచి 7.5 లక్షలు, భారత్ 7.25, గౌతమాలా 6.75, హొండురాస్ నుంచి 5.25 లక్షల వంతున ఉన్నారు. ఇలా వచ్చిన వారు వ్యవసాయం, హొటల్, ఇతర చిన్న చిన్న పనులు చేస్తున్నారు. వీరందరూ ఇప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉన్నారు. ఎప్పుడేం జరుగుతుందో తెలియని స్థితి. అయితే వీరితో పని చేయించుకొనే వారికి కూడా సమస్యే. ఒక్కసారిగా వీరంతా లేకపోతే ఏం చేయాలి? ఇప్పటికే అనేక ప్రాంతాల పొలాల్లో నిలువు మీద ఉన్న పంటలు దెబ్బ తిన్నట్లు వార్తలు వచ్చాయి. వలసదారుల సమస్య ఫెడరల్ ప్రభుత్వానిది, అయితే తమ నేత ట్రంప్ మెప్పు పొందేందుకు రిపబ్లికన్ పార్టీకి చెందిన ఫ్లోరిడా రాష్ట్ర గవర్నర్ (మన ముఖ్యమంత్రి మాదిరి) రాన్ డెశాంటిస్ హడావుడి చేస్తున్నాడు. ఆ రాష్ట్ర శాసన సభ్యులు తనకు సహకరించాలని కోరుతున్నాడు. ట్రంప్ సర్కార్ అక్రమ వలసదారులను బలవంతంగా తిప్పి పంపేందుకు తీసుకున్న కార్యక్రమానికి సహకరించని స్థానిక ఉద్యోగులను ఇంటికి పంపే అధికారం తనకు కావాలని కోరుతున్నాడు. ఫ్లోరిడాలో ఉంటూ విదేశాలకు డబ్బు పంపేవారు వాటి వివరాలను అందచేయాలని, తద్వారా వారి వలస స్థితిని గుర్తించవచ్చంటున్నాడు. రాన్ డెశాంటిస్ తీరుతెన్నులను చూసి అనేక మంది అపహాస్యం చేస్తున్నారు. కొన్ని చట్టాలను చేసేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల ఏర్పాటుకు పరిశీలించాలంటూ ఒక జర్నలిస్టు వ్యంగ్యంగా రాసినప్పటికీ అక్రమ వలసదారులను వెనక్కు పంపితే తలెత్తే పరిస్థితి ఎలా ఉంటుందో అర్ధం చేసుకోవచ్చు. వాటిలో కొన్ని ఇలా ఉన్నాయి. ఫ్లోరిడాలో నమోదైన పౌరులకు "పొలాల్లో పనిచేసే స్వేచ్ఛా చట్టం 2025" చేయాలి. తద్వారా పొలాల్లో మిరియాలు, చెరకు, ఇతర పంటలు ఎండి, చెడిపోకుండా ఎలా తీసుకురావాలో పౌరులకు శిక్షణ ఇవ్వాలి. "దేశభక్తులైన ఈ కార్మికులకు" పొలాల్లోకి రాను పోను బస్‌లను ఏర్పాటు చేయాలి, అవసరం ఉన్నా లేకున్నా ప్రతి నాలుగు గంటలకు వారికి ఐదు నిమిషాల పాటు మంచి నీరు తాగేందుకు విరామం ఇవ్వాలి. పని చేసే సమయాల్లో తగిలే దెబ్బలు (వడదెబ్బ లేదా తలెత్తే మానసిక వత్తిడి)తో భూ యజమానులకు ఎలాంటి సంబంధం లేదని పనిచేసే వారు హామీ పత్రం మీద సంతకాలు చేయాలి. ఫ్లోరిడా చొరవలో సహాయకులు అనే పథకం కింద ఇళ్లలో పని చేసే వారికి నైపుణ్యాల శిక్షణ ఇవ్వాలి. హొటళ్లు కార్మికుల కొరత ఎదుర్కొంటున్నపుడు అత్యవసర పని చేసేందుకు సిద్ధంగా ఉండాలి. అతిథేయ రంగంలో వారికి వారం పాటు శిక్షణ ఇవ్వాలి.

# హైదరాబాద్‌లో ఇల్లు కొనాలనుకుంటున్నారా..?



తొలిఅడుగు, హైదరాబాద్ : హైదరాబాద్‌లో లగ్జరీ గృహాల ధరలు గత ఐదేళ్లలో గణనీయంగా పెరిగాయి. 2018లో చదరపు అడుగుకు సగటు ధర రూ.7,450గా ఉండగా, 2024 నాటికి ఇది రూ.10,580కి చేరుకుంది. మొత్తం 42 శాతం మేర పెరుగుదల నమోదైంది. హైదరాబాద్‌లో లగ్జరీ గృహాల ధరలు గత ఐదేళ్లలో గణనీయంగా పెరిగాయి. 2018లో చదరపు అడుగుకు సగటు ధర రూ.7,450గా ఉండగా, 2024 నాటికి ఇది రూ.10,580కి చేరుకుంది. మొత్తం 42 శాతం మేర పెరుగుదల నమోదైంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో ఈ స్థాయిలో వృద్ధి నమోదైన ఏకైక నగరం హైదరాబాద్ కావడం విశేషం. కోకాపేట, మోకిల ప్రాంతాల్లో భూముల ధరలు విపరీతంగా పెరగడం, మెట్రో కనెక్టివిటీ మెరుగుపడడం, ఐటీ హబ్‌గా అభివృద్ధి చెందడంతో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం వేగంగా ఎదుగుతోంది. ఇతర నగరాలతో పోల్చితే.. హైదరాబాద్‌లో లగ్జరీ గృహాల ధరలు అత్యధికంగా 42 శాతం పెరిగాయి.. దీంతోపాటు ఇతర ప్రధాన నగరాల్లోనూ ధరల పెరుగుదల కనిపించింది. బెంగళూరులో 27 శాతం, ముంబైలో 27 శాతం, చెన్నైలో 15 శాతం మేర ధరలు పెరిగాయి. పుణేలో 19 శాతం, కోల్‌కతాలో 12 శాతం వృద్ధి నమోదైంది. మొత్తంగా చూసుకుంటే, లగ్జరీ గృహాల విభాగంలో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. లగ్జరీ గృహాల పాటు, మధ్యతరగతి ఇళ్ల ధరల్లోనూ హైదరాబాద్ అగ్రస్థానంలో ఉంది. రూ.40 లక్షల నుంచి కోటిన్నర వరకు ధర కలిగిన ఇళ్ల విభాగంలో 23 శాతం వృద్ధి నమోదైంది. 2018లో చదరపు అడుగుకు సగటు ధర రూ.6,050గా ఉండగా, ప్రస్తుతం అది రూ.7,120కి చేరుకుంది. ఈ విభాగంలోనూ హైదరాబాద్ దేశంలోనే అత్యధిక వృద్ధి నమోదు చేసుకుంది. అందుబాటు గృహాల విభాగంలోనూ హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. రూ.40 లక్షలలోపు ధర కలిగిన ఇళ్లలో 16 శాతం వృద్ధి నమోదైంది. 2018లో చదరపు అడుగుకు సగటు ధర రూ.3,750గా ఉండగా, ప్రస్తుతం అది రూ.4,310కి పెరిగింది. ఈ విభాగంలో అత్యధిక వృద్ధి 19 శాతంతో ఎన్సీఆర్లో నమోదైంది. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందడానికి పలు కారణాలు ఉన్నాయి. ఐటీ హబ్‌గా నగర అభివృద్ధి, మెట్రో రెండవ దశ పూర్తి కావడం, కొత్త కమర్షియల్ హబ్‌లు రావడం వంటి అంశాలు మార్కెట్‌ను ప్రోత్సహిస్తున్నాయి.

# పొదుపు చేయలేకపోతున్నారా?





తొలి అడుగు, : మీ ఆదాయం నుంచి మీ అవసరాల కోసం ఎంత ఖర్చు చేయాలనుకుంటున్నారో ముందుగానే ప్లాన్ చేసుకోవడమే బడ్జెట్ అంటే. మీకు ఎన్ని మార్గాల నుంచి ఆదాయం వస్తుందో ముందో ఓ అంచనా వేసుకోండి. దాన్ని బట్టి మీ సేవింగ్స్ నుంచి ఎంత పక్కన పెట్టాలనుకుంటున్నారో ముందు ఫిక్స్ అవ్వండి. కొందరు రోజంతా కష్టపడి పనిచేస్తారు. వచ్చిన జీతాన్ని అపురూపంగా చూసుకుంటారు. పట్టుమని పదిరోజులు గడిచేలోపే ఉన్న డబ్బంతా ఖర్చైపోతుంది. దీంతో చేసిన కష్టమంతా దుబారా అవుతుందనే దిగులు ఓ వైపు.. రేపటి కోసం అసలేం పొదుపు చేయలేకపోతున్నాం.. అపరాధ భావన లోలోపలే తినేస్తుంటుంది. భవిష్యత్తులో వచ్చే ఆకస్మిక అవసరాల కోసం ఎంతో కొంత పొదుపు చేసే అలవాటు లేకపోతే కష్టాలు తప్పవని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇవేవీ లేకుండా మీ బడ్జెట్ ను ప్లాన్ చేసుకోవడం ఎలాగో తెలుసుకోండి. మీరు ఎక్కువగా దేని కోసం ఖర్చు చేయాల్సి వస్తుందో ముందు గమనించుకోండి. అప్పుడే మీ చేతిలో డబ్బు నిలుస్తుంది. అనవసర ఖర్చులను గుర్తించి మళ్లీ వాటి జోలికి వెళ్లకుండా మిమ్మల్ని మీరు నియంత్రించుకోగలగాలి. సంపాదన మొత్తం షాపింగ్ కు వెళ్లొచ్చేసరికి ఐస్ క్యూబ్ లా కరిగిపోతుంటుంది. అందుకే ముఖ్యమైన, అవసరమైన వస్తువులేంటో బయటకు వెళ్లేముందే స్పష్టంగా అనుకోవాలి. ఆఫర్లు, కూపన్లు చూసి వాటిని ఉపయోగించుకోండి. ముఖ్యంగా షాపింగ్ చేసేటప్పుడు క్యాష్ ను క్యారీ చేసేలా చూసుకోండి. మీకు గనుకు టైమ్, చేయగలిగే ఆసక్తి ఉంటే రెండో ఇన్ కం గురించి ప్రయత్నించండి. దీంతో మీ పైపై ఖర్చులన్నీ క్లియర్ చేసుకోవచ్చు. అయితే అది మీ వ్యక్తిగత జీవితానికి ఇబ్బంది లేని విధంగా సెట్ చేసుకోండి. లేదంటే అదనపు పనిభారం వల్ల వచ్చే సమస్యలతో మరింత ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందుకే మీ సామర్థ్యాలపై మీకో ఐడియా ఉండటం మంచిది.

# 17 ఏళ్ల తర్వాత బీఎస్ఎన్ఎల్ మంచి రోజులు..




తొలి అడుగు, : నెట్‌వర్క్ విస్తరణ, ఖర్చు ఆప్టిమైజేషన్, కస్టమర్-కేంద్రీకృత సేవా మెరుగుదలలపై దృష్టి సారించిన ప్రయత్నాలే ఈ విజయానికి కారణమని బీఎస్ఎన్ఎల్ పేర్కొంది. బీఎస్ఎన్ఎల్ సానుకూల వృద్ధిలో ఒక మైలురాయిని జరుపుకుంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికానికి కంపెనీ విడుదల చేసిన గణాంకాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. ప్రైవేట్ టెలికాం కంపెనీలు అత్యంత ఆకర్షణీయమైన ఆఫర్లను, ఉత్తమ నెట్‌వర్క్‌ను అందిస్తున్నందున మంచి ఆదరణ లభిస్తోంది. ఎన్నో ఏళ్ల నుంచి భారీ నష్టాలను చవిచూసిన బిఎస్ఎన్ఎల్‌ను మూసివేస్తారని కూడా పుకార్లు వచ్చాయి. గ్రామాల్లో తన నెట్‌వర్క్‌ను విస్తృతంగా విస్తరించిన బిఎస్ఎన్ఎల్.. ఇటీవల టవర్ కింద నిలబడినా ప్రజలు నెట్‌వర్క్ కవరేజ్ పొందలేని పరిస్థితిని ఉండేది. దీని వలన వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌లను ఉపయోగించడం ప్రారంభించారు. కానీ ఇప్పుడు తిరిగి పుంజుకున్న బిఎస్ఎన్ఎల్, కొత్త మార్గంలో కస్టమర్లను చేరుకోవడం ద్వారా, తన నెట్‌వర్క్‌ను మళ్ళీ విస్తరించడం ద్వారా ప్రజలకు మరింత దగ్గరవుతోంది. అలాగే 17 సంవత్సరాల తర్వాత ఈ త్రైమాసికంలో రూ. 262 కోట్లు లాభాలను గడించింది. నెట్‌వర్క్ విస్తరణ, ఖర్చు ఆప్టిమైజేషన్, కస్టమర్-కేంద్రీకృత సేవా మెరుగుదలలపై దృష్టి సారించిన ప్రయత్నాలే ఈ విజయానికి కారణమని బీఎస్ఎన్ఎల్ పేర్కొంది. 17 సంవత్సరాల తర్వాత బిఎస్ఎన్ఎల్ రూ.262 కోట్లు లాభాలను నమోదు చేసింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ.. ఇన్నేళ్ల తర్వాత లాభాలను ఆర్జించడం ఒక మలుపుగా అభివర్ణించారు. బిఎస్ఎన్ఎల్ సేవలు 14-18% పెరిగాయి. ఇప్పుడు దూచీ 4+ సేవలను కూడా ప్రారంభించింది. బీఎస్ఎన్ఎల్ సానుకూల వృద్ధిలో ఒక మైలురాయిని జరుపుకుంటుంది. మూడవ త్రైమాసికంలో తాము రూ,262 కోట్లలాభాన్ని సాధించాము. ఇది 2007 తర్వాత లాభాలను సాధించామని బీఎస్ఎన్ఎల్ తెలిపింది. ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేస్తున్నప్పుడు మీ నిరంతర నమ్మకం, మద్దతుకు ధన్యవాదాలు! అంటూ వినియోగదారులనుద్దేశించి ట్వీట్ చేసింది. బిఎస్ఎన్ఎల్ కథ ముగిసిపోయిందని ఎందరో అన్నారని, ఈ కంపెనీ నిరంతరం నష్టాలను చవిచూసింది. అది కూడా, 1-2 సంవత్సరాలు కాదు, దూచీ 2007 నుండి నష్టాల్లో నడుస్తోంది. దీనిని ప్రైవేటీకరిస్తారనే ఊహాగానాలు కూడా ఉన్నాయి. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికానికి కంపెనీ విడుదల చేసిన గణాంకాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ దాదాపు 17 సంవత్సరాల తర్వాత లాభాలను నమోదు చేసింది. డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ రూ.262 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. నికర లాభం ఆర్జించింది.



# ప్లాస్టిక్ కంటైనర్లలో తింటున్నారా..

**తొలిఅడుగు, ఆరోగ్యం :** రెస్టారెంట్ నుంచి ఫుడ్ ఆర్డర్ చేస్తున్నారా.. అయితే మీ ఆరోగ్యాన్ని మీరే చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. మీరు చేసే ఈ చిన్న పొరపాటే ప్రాణాంతక గుండె జబ్బులకు దారితీస్తోంది. నానాటికీ పెరుగుతున్న గుండెపోటు మరణాలు గుబులు పుట్టిస్తున్న సమయంలో తాజా పరిశోధన ఆందోళన కలిగిస్తోంది. ప్లాస్టిక్ వాడకం మానవ శరీరానికి ఎంత హానికరమో చెప్తూ ఓ వైపు సైంటిస్టులు గగ్గోలు పెడుతున్నా వీటి వినియోగం మాత్రం తగ్గడం లేదు. ప్లాస్టిక్ టీ కప్పులు, సంచులు, డబ్బాలు, జార్లు, టిఫిన్ బాక్సులు.. ఇలా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగమే. ఏ హోటల్ నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టుకున్నా వేడి వేడి ఆహారాన్ని ప్లాస్టిక్ కంటైనర్లలోనే పంపిస్తున్నారు. వీటిని వన్ టైం యూజ్ అని తెలిసినా కొందరు కడిగి మళ్లీ మళ్లీ వాడుతుంటారు. ఈ ఫుడ్ కంటైనర్లపై తాజా అధ్యయనాలు గుండె పగిలే వార్తను చెప్తున్నాయి. గుండెకు చేటు.. ప్లాస్టిక్ టేక్ అవుట్ కంటైనర్లలో తినడం వల్ల కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్ రిస్క్ అధికంగా ఉంటోందని వారు వెల్లడించారు. అంతే కాదు ఇది మీ గట్ బయోమ్ లో మార్పులను చేసి ఆ జీర్ణ వ్యవస్థను పూర్తిగా దెబ్బతీస్తుందట. పరిశోధకులు చెప్తున్న వివరాల ప్రకారం.. ఆహార పాత్రల నుంచి వచ్చే మైక్రో ప్లాస్టిక్ లు మన ఆహారంలో లీక్ అయి చివరకు మన ప్రేగుల్లోకి ప్రవేశిస్తాయి. ఇది ప్రేగులోని సున్నితమైన పైపొరను డ్యామేజ్ చేస్తుంది. ఫలితంగా హానికరమైన కణాలు రక్తంలోకి ప్రవేశిస్తాయి. రక్తప్రసరణ దెబ్బతినడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం తీవ్ర స్థాయిలో పెరుగుతుందని నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే గుండె సమస్యలు ఉన్నవారు వీటి వినియోగాన్ని పూర్తిగా ఆపేయకుంటే మరింత



ప్రమాదంగా మారొచ్చు. రీసెర్చ్ లో ఏం తేలింది.. పరిశోధకులు ఈ రీసెర్చ్ కోసం రెండు పద్ధతులను ఉపయోగించారు చైనాలో మొదట 3 వేల మందికి పైగా ప్లాస్టిక్ టేక్ అవుట్ కంటైనర్లలో ఎక్కువగా ఆహారం తినే అలవాటు ఉన్న వారికి ఎంపిక చేసుకున్నారు. వారిలో గుండె ఆరోగ్యం, పనితీరు మొదలైన విషయాలను పరిశీలించారు. తర్వాతి పద్ధతిలో ఎలుకలను నీటిలో ప్లాస్టిక్ రసాయనాలు కలిపిన రసాయనాలను తాగించారు. ఈ పరిశోధనలో ప్లాస్టిక్ రక్తంలో అధిక మొత్తంలో కలవడంతో గుండె ఆగిపోయే ప్రమాదం ముడిపడి ఉందని గుర్తించారు. గాజు లేదా స్టెయిన్ లెస్ స్టీల్ కంటైనర్లను ఆహారం తినేందుకు ఎంచుకోవాలి.

# కొబ్బరి నీళ్లు తాగితే జరిగే అద్భుతాలు



**తొలిఅడుగు, ఆరోగ్యం :** కొబ్బరి నీళ్లలో శరీరానికి కావలసినన్ని పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ నీళ్లలో ఉండే కొన్ని మూలకాలు జీర్ణక్రియను ఆరోగ్యంగా చేసి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షిస్తాయి. అయితే, ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగితే ఏమవుతుందో ఎప్పుడైనా ఆలోచించరా..? ఇలా పరగడుపునే కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరంలో ఎలాంటి మార్పులు కలుగుతాయో ఇక్కడ తెలుసుకుందాం. కొబ్బరి నీళ్లలో శరీరానికి కావలసినన్ని పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ నీళ్లలో ఉండే కొన్ని మూలకాలు జీర్ణక్రియను ఆరోగ్యంగా చేసి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షిస్తాయి. ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరం హైడ్రేషన్‌గా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో నీటి కొరతను కూడా తీరుస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ప్రతిరోజు కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి అమాంతంగా పెరుగుతుంది. ఇన్ఫెక్షన్లు, సీజనల్ వ్యాధులు రాకుండా ఉంటాయి. ఎల్లప్పుడూ సీజనల్ వ్యాధులతో బాధపడేవారు క్రమం తప్పకుండా కొబ్బరి నీళ్లు తాగటం వల్ల ప్రయోజనం ఉంటుంది. ప్రతిరోజు ఉదయాన్నే కొబ్బరి నీళ్లు తాగడం వల్ల గుండె సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే కొన్ని గుణాలు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తాయి. అంతేకాకుండా గుండెను శక్తివంతంగా చేసేందుకు సహాయపడతాయి. కొబ్బరి నీటిలో ఎలక్ట్రోలైట్లు ఉంటాయి. వీటి కారణంగా శరీరం ఫ్రెష్‌గా ఉంటుంది. ఇన్ ఫెక్షన్‌లతో బాధ పడుతున్న వారు ఈ నీల్లు తాగడం మంచిది. అలాగే బీపీ, షుగర్, గుండె జబ్బులు కంట్రోల్‌లో ఉంటాయి. పెరుగుతున్న బరువు తగ్గడానికి, మీరు రోజూ కొబ్బరి నీళ్లు తాగాలి. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, మీరు రోజూ కొబ్బరి నీళ్లు తాగాలి. చర్మాన్ని ప్రకాశవంతంగా, మెరిసేలా చేయడానికి కొబ్బరి నీళ్లు కూడా ఉపయోగపడతాయి. మీ రోగనిరోధక శక్తిని పెంచడానికి మీరు కొబ్బరి నీళ్లు తాగాలి.

# ఈ ఆకులను నమిలితే ఎన్ని ప్రయోజనాలు తెలుసా..?

**తొలిఅడుగు, ఆరోగ్యం :** తులసిలో యాంటీఆక్సిడెంట్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ ఆకులను ఉదయాన్నే తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రోగాల బారిన పడకుండా శరీరాన్ని రక్షిస్తుంది. కాలనుగుణంగా వ్యాధులను నయం చేయడానికి తులసిని మించింది. తులసి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి చాలా మందికి పెద్దగా తెలియదు. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె వంటి అనేక రకాల విటమిన్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి. తులసిలో కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, ఐరన్, పొటాషియం వంటి ఖనిజాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఎముకల ఆరోగ్యానికి, రక్త ప్రసరణకు, నరాల ఆరోగ్యానికి ఇవి ఎంతో మేలు చేస్తాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. ఉదయాన్నే తులసి ఆకులను తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి? తులసిలో యాంటీఆక్సిడెంట్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఈ ఆకులను ఉదయాన్నే తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రోగాల బారిన పడకుండా శరీరాన్ని రక్షిస్తుంది.



కాలనుగుణంగా వ్యాధులను నయం చేయడానికి తులసిని మించింది ఏదీ లేదని నిపుణులు చెబుతుంటారు. వర్షాకాలంలో తులసి ఆకులను నమలడం వల్ల శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలను తగ్గిస్తుంది. తులసి ఆకులను నమలడం వల్ల అందులోని పోషకాల వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఇది అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది. ఇది ఆకలిని నియంత్రించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది.

# అల్లం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు..

**తొలిఅడుగు, ఆరోగ్యం :** వంటగదిలో సులభంగా లభించే అల్లంతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో తెలుసా..? అల్లం ఆహారం రుచిని, వాసనను పెంచడమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఒక వరం అని చెప్పవచ్చు. రోజూ అల్లం తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజు ఉదయం ఖాళీ కడుపుతో ఒక చిన్న అల్లం ముక్కను నమిలి తినవచ్చు. ఇది కుదరకపోతే ఉదయం ఖాళీ కడుపుతో అల్లం వేసి మరిగించిన నీటిని తాగవచ్చు. ఇది మీ శరీరానికి ఊహించని అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఆ వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. ఇందులో ఉండే ఎంజైమ్‌లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో అల్లం తింటే కడుపులో యాసిడ్ ఉత్పత్తి పెరుగుతుంది. అల్లం తింటే ఆహారం సులభంగా జీర్ణమయ్యి మలబద్ధకం సమస్య తగ్గుతుంది. శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వును కరిగించడానికి అల్లం సహాయపడుతుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీవక్రియ వేగవంతమవుతుంది. ఇది బరువు తగ్గడాన్ని సులభతరం చేస్తుంది. గుండె ఆరోగ్యానికి కూడా అల్లం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది గుండెపోటు, పక్షవాతానికి కారణమయ్యే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. డయాబెటిక్ రోగులకు కూడా అల్లం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



ఎందుకంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. అల్లం శరీరంలో పేరుకుపోయిన వ్యర్థాలు, టాక్సిన్‌లను తొలగించడంలో సహాయపడుతుంది. ఇది ఉదయం ఖాళీ కడుపుతో తాగడానికి ఉత్తమమైన డిటాక్స్ పానీయంగా ఉంటుంది. అల్లంలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వల్ల శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో అల్లం తింటే వ్యాధులతో పోరాడటానికి శరీరం బలంగా మారుతుంది. అల్లం చర్మానికి కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది చర్మాన్ని మెరిసేలా, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. అల్లంలోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని రక్షిస్తాయి. అల్లం జుట్టుకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది జుట్టును బలమైనదిగా, ఒత్తుగా ఉంచడంలో సహాయపడుతుంది. అల్లంలోని పోషకాలు జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి.

# నాన్ స్టిక్ పాత్రల్లో వండుతున్నారా?


**తొలిఅడుగు, ఆరోగ్యం :** నూనె వాడకం తగ్గుతుందనో.. వంట సులువవుతుందనో చాలా మంది నాన్ స్టిక్ పాత్రలు వాడుతుంటారు. వీటి వాడకం వల్ల కలిగే ప్రమాదాల గురించి మీకు ఇప్పటికే ఒక అవగాహన వచ్చే ఉంటుంది. కానీ, తాజాగా వీటి వాడకంపై నిపుణులు చెప్తున్న విషయాలు వింటే ఇప్పుడే వాటిని పక్కన పెట్టేస్తారు. ఇప్పటికే ఐసీఎంఆర్ వంటి సంస్థలు వీటి వాడకంపై హెచ్చరికలు జారీ చేశారు. నాన్ స్టిక్ పాత్రల్లో వాడే పదార్థాన్ని టెఫ్లాన్ అంటారు. ఇది కార్బన్, ఫ్లోరిన్ పరమాణువులతో చేస్తారు. ఇందులో సింథటిక్ రసాయనాలు వాడుతారు. అందుకే నాన్ స్టిక్ పాన్ ల మీద ఏ చిన్న గీత పడినా అది టెఫ్లాన్ ను కరిగించి అందులోనుంచి విషవాయువులను విడుదల చేస్తుంది. ఈ హానికర కెమికల్స్ మనం తినే ఆహారంలో కలుస్తాయి. కనీసం ఒక్క గీత నుంచి 9 వేల మైక్రో ప్లాస్టిక్ రేణువులు విడుదల చేస్తుందట. ఈ లెక్కన మనం వాడే పాత్రల్లో వందల గీతలు ఉంటాయి. వీటి నుంచి లక్షల స్థాయిలో మైక్రో ప్లాస్టిక్స్ విడుదలై మన శరీరంలో కలిసిపోయుంటాయి. ఇది మన ఆరోగ్యాన్ని తీవ్ర స్థాయిలో దెబ్బతీస్తుందని నిపుణులు చెప్తున్నారు. 170 సెల్సియస్ డిగ్రీల కన్నా ఈ పాత్రలను వేడి చేసినప్పుడు వాటి నుంచి విడుదలయ్యే అణువులు శ్వాసకోశ వ్యాధులను కలిగిస్తాయని ఐసీఎంఆర్ తెలిపింది. అంతేకాదు ఇవి థైరాయిడ్, క్యాన్సర్ వంటి వ్యాధులను కూడా కలుగజేస్తుందట. గీతలు



పడకపోయినా వీటిని వాడకపోవడమే మంచిదట. ఈ పాత్రల ఆకారంలో ఏమాత్రం తేడా గమనించినా వాటిని పక్కన పెట్టేయాలని సూచిస్తున్నారు. వీటి కారణంగా వివిధ రకాల క్యాన్సర్లతో పాటు కిడ్నీ వ్యాధులు, అధిక రక్తపోటును కూడా కలిగిస్తుందట. నాన్?స్టిక్ పాత్రలను ఉపయోగించడం వల్ల క్యాన్సర్, సంతానోత్పత్తి, శరీర నొప్పులు, హార్మోన్లలో అసమతుల్యత, తలనొప్పి వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ వెల్లడించింది. నాన్ స్టిక్ పాత్రలకు బదులుగా పాత పద్ధతిలో వాడే పాత్రలను ఉపయోగించుకోవచ్చు. పూర్వం మట్టిపాత్రల్లో వండేవారు. అది ఆరోగ్యానికి ఎన్నో విధాలుగా మేలు చేస్తుంది. అయితే వీటిని మెయింటైన్ చేయడం అన్ని వేళలా సాధ్యం కాదు కాబట్టి అడుగు మందంగా ఉండే స్టెయిన్ లెస్ స్టీలును వాడుకోవచ్చు. మంటను సిమ్ లో పెట్టి వంట చేయడం వల్ల అడుగు మాడే సమస్య దాదాపు తగ్గుతుంది. రసాయనిక పూతలు లేని పాత్రలను కూడా వంట కోసం ఉపయోగించవచ్చు.

తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

# అందం వెన్నెల ఈ కోమలి..



తొలిఅడుగు, సినిమా రుక్సార్ ధిల్లాన్ ప్రధానంగా తెలుగు, హిందీ, కన్నడ చిత్రాలలో కథానాయకిగా నటిస్తుంది. అందం, అభినయంతో ప్రేక్షకులను ఫిదా చేస్తుంది. తెలుగు ఎక్కువ సినిమాల్లో కనిపించింది. వీటిలో కొన్ని విజయాన్ని అందుకున్నాయి. ఎప్పుడు సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ తన ఫొటోలతో కుర్రాళ్లను ఫిదా చేస్తుంది ఈ బ్యూటీ. తాజాగా ఈమె షేర్ చేసిన ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి. 12 అక్టోబర్ 1993న లండన్‌లో పంజాబీ సంతతికి చెందిన కుటుంబంలో జన్మించింది వయ్యారి భామ రుక్సార్ ధిల్లాన్. యూకేలో పుట్టినప్పటికీ గోవాలో పెరిగింది. ఈ ముద్దుగుమ్మ కుటుంబం ఇప్పుడు కర్ణాటకలోని బెంగళూరులో స్థిరపడింది. ఇండియాలోనే ఓ ప్రముఖ కళాశాల నుంచి ఫ్యాషన్ డిజైన్‌లో డిగ్రీ పట్ట పొందింది అందాల తార రుక్సార్ ధిల్లాన్. 2016లో రన్ ఆంటోనీతో సినీరంగ ప్రవేశం చేసింది. 2017లో ఆకతాయి అనే సినిమాతో తెలుగు చలనచిత్రం అరంగేట్రం చేసింది. ఆ తర్వాత నేచురల్ స్టార్ నాని కృష్ణార్జున యుద్ధంలో హీరోయిన్?గా తన నటనతో పాటు తన అందంతోనూ ఆకట్టుకుంది ఈ బ్యూటీ. ఆ తర్వాత అల్లు శిరీష్ హీరోగా నటించిన ఏబీసీడీ అనే సినిమాలో చేసింది. ఇది ఆశించిన విజయాన్ని అందుకోలేదు. తర్వాత విశ్వక్ సేన్ హీరోగా నటించిన అశోకవనంలో అర్జున కల్యాణం సినిమాతో హిట్ అందుకుంది. ఇందులో రుక్సార్ ధిల్లన్ సెకండ్ హీరోయిన్. స్పార్క్ ఎల్.ఐ.ఎఫ్.ఈ అనే సినిమాలో కనిపించింది. 2024లో నా సామిరంగా సినిమాల్లో నటించింది రుక్సార్ ధిల్లన్. 2022 నుంచి లయన్స్‌గేట్ ఇండియాలో ప్రసారం అవుతున్న జుగాదిస్తాన్ అనే బాలీవుడ్ కామెడీ డ్రామా వెబ్‌సిరీస్‌లో తొలిసారి హిందీ ప్రేక్షకులకు పరిచయం అయింది ఈ బ్యూటీ. ప్రస్తుతం తెలుగులో కథానాయకిగా రాణిస్తుంది ఈ వయ్యారి.

# రీ రిలీజ్‌లో రికార్డులు కొల్లగొడుతోన్న లవ్ స్టోరీ




తొలిఅడుగు, సినిమా ఒక్కొక్కసారి కొన్ని మంచి సినిమాలు కూడా ప్రేక్షకుల తిరస్కరణకు గురవుతుంటాయి. అయితే ఇటీవల కాలంలో రి రిలీజ్ ల ట్రెండ్‌తో, అలాంటి కొన్ని సినిమాలకు న్యాయం జరుగుతోంది. మొదట విడుదలైనప్పుడు ప్రేక్షకుల మెప్పు పొందని కొన్ని మంచి సినిమాలు రి రిలీజ్ లలో రికార్డుల కొల్లగొడుతున్నాయి. మొదట విడుదలైనప్పుడు సూపర్ హిట్ అయిన సినిమాలు రిరిలీజైనప్పుడు భారీ కలెక్షన్లు సాధించడం సర్వసాధారణం. అయితే మొదట విడుదలైనప్పుడు ఫ్లాప్ అయి, తొమ్మిది సంవత్సరాల తర్వాత తిరిగి విడుదలైనప్పుడు బ్లాక్ బస్టర్లుగా మారిన సినిమాల సంఖ్య చాలా అరుదు. అలాంటి ఒక ప్రత్యేక రికార్డును హిందీ చిత్రం 'సనమ్ తేరీ కసమ్' నెలకొల్పింది. 2016లో విడుదలైన 'సనమ్ తేరి కసమ్' సినిమా అప్పట్లో ఫ్లాప్‌గా నిలిచింది. కానీ ఇప్పుడు ఈ సినిమా బ్లాక్ బస్టర్. తెలుగు నటుడు హర్షవర్ధన్ రాణే , మార్వా హొుకేన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'సనమ్ తేరి కసమ్' చిత్రం 2016లో దాదాపు 20 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కింది. అయితే అప్పట్లో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కేవలం 9 కోట్లు మాత్రమే రాబట్టింది. కొంతమంది స్టార్ నటుల చిత్రాల ప్రభావం వల్ల ఆ సినిమా బాక్సాఫీస్ రేసులో వెనుకబడిపోయింది. కానీ ఆ తర్వాత, టీవీలు, పైరేటెడ్ కాపీల ద్వారా, ఆ సినిమా లక్షలాది మందికి చేరువైపోయింది. కల్ట్ క్లాసిక్ లవ్ స్టోరీగా, బాలీవుడ్‌లోని అత్యుత్తమ ప్రేమకథలలో ఒకటిగా ప్రశంసలు పొందింది. 'సనమ్ తేరి కసమ్' సినిమా ఏడు రోజుల క్రితం తిరిగి విడుదలై బ్లాక్ బస్టర్ అయింది. తొమ్మిది సంవత్సరాల తర్వాత పరిమిత థియేటర్లలో తిరిగి విడుదలైన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచి కేవలం ఏడు రోజుల్లోనే రూ. 30 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. ఈ సినిమా ఇటీవల హిందీలో తిరిగి విడుదలైన అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో చేరింది. షారుఖ్-సల్మాన్ ఖాన్ ల ఇటీవల తిరిగి విడుదలైన 'కరణ్ అర్జున్' కూడా అంత పెద్ద మొత్తాన్ని సంపాదించలేదు.

# ఓటీటీలో దూసుకుపోతున్న రివేంజ్ థ్రిల్లర్..



తొలిఅడుగు, సినిమా ఓటీటీ ప్లాట్ ఫామ్స్‌లో ఎప్పటికప్పుడు సరికొత్త కంటెంట్ చిత్రాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు మేకర్స్. హారర్, సస్పెన్స్ థ్రిల్లర్, మిస్టరీ సినిమాలు చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు మేకర్స్. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఓటీటీలో ఓ రివేంజ్ డ్రామా దూసుకుపోతుంది. ది టీచర్.. రెండేళ్ల కిందట థియేటర్లలో విడుదలై మిక్స్డ్ టాక్ అందుకున్న సినిమా. మలయాళంలో రిలీజ్ అయిన ఈ సినిమాకు డైరెక్టర్ వివేక్ దర్శకత్వం వహించారు. ఇందులో హీరోయిన్ అమలా పాల్ కథానాయికగా నటించగా, ఓ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పాత్రలో ఆమె కనిపించింది. 2022 డిసెంబర్ లో థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చింది. థియేటర్లలో ప్రేక్షకులను అలరించిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో దూసుకుపోతుంది. ఓటీటీ మూవీ లవర్స్ సైతం ఈ చిత్రాన్ని బాగానే ఆదరించారు. ఓ టీచర్ తనకు అన్యాయం చేసిన నలుగురు స్టూడెంట్స్ పై ఎలా ప్రతీకారం తీర్చుకుంటుందన్న కథా ఆధారంగానే ఈ సినిమాను రూపొందించారు. పక్క మలయాళం మార్క్ రివేంజ్ థ్రిల్లర్ మూవీ ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతుంది. రెగ్యులర్ రివేంజ్ థ్రిల్లర్ సినిమాలకు భిన్నంగా ఈ ది టీచర్ కథ ఉంటుంది. ఇందులో దేవిక అనే టీచర్ పాత్రలో తన నటనకు ప్రశంసలు అందుకుంది.

# చరిత్ర సృష్టించిన హీరో..



తొలిఅడుగు, సినిమా : సౌత్ ఇండస్ట్రీలోనే ఆయనో సూపర్ స్టార్. ఎన్నో అద్భుతమైన పాత్రలు..అనేక సూపర్ హిట్ చిత్రాల్లో నటించి కోట్లాది మంది అభిమానులను సంపాదిచుకున్నారు. కానీ మీకు తెలుసా.. ఆయన ఒక్క ఏడాదిలోనే 36 సినిమాల్లో నటించి రికార్డ్ సృష్టించారు. 70 ఏళ్ల వయసులోనూ హీరోగా యంగ్ స్టార్స్ కు పోటీ ఇస్తున్నారు. ప్రస్తుతం భారీ బడ్జెట్, పాన్ ఇండియా సినిమాలను తెరకెక్కించేందుకు దర్శకనిర్మాతలు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో నిర్మాణ పనులలో ఆలస్యం, స్పెషల్ ఎఫెక్ట్స్ కారణంగా మూవీ కంప్లీట్ కావడానికి సంవత్సరాలు పడుతుంది. అలాగే పలువురు స్టార్స్ ఒక్క సినిమా కోసం సంవత్సరాలు వెచ్చిస్తున్నారు. మరికొందరు మాత్రం వెంట వెంటనే కొత్త ప్రాజెక్ట్స్ స్టార్ట్ చేస్తున్నారు. కానీ ఒకే సంవత్సరంలో అత్యధిక చిత్రాలలో నటించి రికార్డు సృష్టించిన హీరో గురించి తెలుసా.? అవును.. ఒక్క ఏడాదిలోనే ఏకంగా 36 సినిమాల్లో నటించి హిస్టరీ క్రియేట్ చేసాడు. అతడు మరెవరో కాదు.. మలయాళీ స్టార్ మమ్ముట్టి. 1971లో అనుభవంగల్ పాలిచకల్ అనే సినిమాలో ఒక చిన్న పాత్రతో సినీరంగంలోకి అడుగుపెట్టాడు. ఆ తర్వాత 1980లో మేళ సినిమాతో హీరోగా మారాడు. ఆ తర్వాత మలయాళ సినిమాల్లో అత్యంత బిజీగా ఉండే నటులలో ఒకరు అయ్యారు. 1982లో, మమ్ముట్టి 24 సినిమాల్లో నటించాడు. 1983 నుండి 1986 వరకు అతను ప్రతి సంవత్సరం 36, 34, 28, 35 సినిమాల్లో నటించి రికార్డ్స్ క్రియేట్ చేశాడు. అతని అంకితభావం అతన్ని పరిశ్రమలో కష్టపడి పనిచేసే నటులలో ఒకరిగా చేసింది. హీరోగా మమ్ముట్టి 400 కి పైగా చిత్రాల్లో నటించారు.

## ట్రై సీరిస్ న్యూజిలాండ్ కైవసం




**తొలిఅడుగు,** : ఎప్పుడు ఎలా ఆడతారో తెలియని క్రికెట్ టీమ్ ఏదైనా ఉందా అంటే అది పాకిస్థాన్ టీమ్ అని కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఒక మ్యాచ్‌లో వరల్డ్ ఛాంపియన్స్‌లా ఆడితే, ఆ నెక్ట్స్ మ్యాచ్‌లోనే పసికూన కంటే దారుణంగా ఆడతారు. ఇది పాకిస్థాన్ క్రికెట్ టీమ్‌కు చెడ్డ పేరు. ఈ మధ్య కాలంలో ఫన్నీ ఫన్నీ థింగ్స్ చేసే టీమ్ ఏది అంటే కూడా పాక్ జట్టు పేరే చెప్పాల్సిన పరిస్థితి వచ్చేసింది. అందుకే వాళ్లు చేసే చిత్రవిచిత్ర విన్యాసాలే కారణం. సింపుల్ రనౌట్లు చేయలేకపోవడం, ఒక క్యాచ్ కోసం ఇద్దరు పరిగెత్తి మధ్యలో నేల పాలు చేసి, ఒకరినొకరు దూషించుకోవడం, రూల్స్ సరిగ్గా తెలియక అంపైర్లతో గొడవకు దిగడం.. ఇలాంటి నవ్వు తెప్పించే పనులన్నీ పాకిస్థాన్ ఆటగాళ్లే ఎక్కువగా చేస్తుంటారు. తాజాగా న్యూజిలాండ్‌తో జరిగిన ట్రై సిరీస్ ఫైనల్ మ్యాచ్‌లోనూ పాక్ ఆటగాళ్లు చేసిన తప్పిదాలతో క్రికెట్ లోకం ముందు మరోసారి నవ్వుల పాలయ్యారు. పాకిస్థాన్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా మధ్య ట్రై సిరీస్ జరిగిన విషయం తెలిసిందే. ఈ సిరీస్‌లో న్యూజిలాండ్ విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ అద్భుత ప్రదర్శనకు పాక్ పిచ్చితనం కూడా తోడై.. కివీస్ జట్టుకు విజయం చేకూరింది. టాస్ గెలిచి ఛేజింగ్ చేయాల్సిన పిచ్‌పై పాక్ కెప్టెన్ మొహమ్మద్ రిజ్వాన్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఇదో చెత్త నిర్ణయంగా చెప్పవచ్చు. ఆ తర్వాత వారి చెత్త ఫీల్డింగ్, ఇన్‌డిసిప్లిన్ బౌలింగ్, పూర్ డిసిషన్స్ న్యూజిలాండ్‌కు కలిసొచ్చాయి. 242 పరుగుల సాధారణ టార్గెట్‌ను కాపాడుకునే క్రమంలో పాక్ బౌలర్లు ఏకంగా 16 వైడ్లు వేశాడు. అలాగే ఈ మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో మంచి ప్రదర్శన చేసిన టామ్ లాథమ్‌ను త్వరగా అవుట్ చేసే అవకాశాన్ని కూడా పాక్ వదిలేసుకుంది. నిజానికి లాథమ్ 15 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఒకసారి, 27 పరుగుల వద్ద ఒకసారి అవుట్ కావాల్సింది. కానీ, ఒకసారి డీఆర్ఎస్ తీసుకోకుండా, ఇంకోసారి సింపుల్ క్యాచ్‌ను వదిలేసి.. పాక్ భారీ మూల్యం చెల్లించుకుంది. ఇలా బ్యాడ్ కెప్టెన్సీతో పాటు చెత్త బౌలింగ్‌తో పాకిస్థాన్ ట్రై సిరీస్ ఫైనల్లో ఓటమి పాలైంది. మరో విచిత్రం ఏంటంటే.. ఈ మ్యాచ్ కంటే ఒక రోజు ముందు సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో రికార్డ్ బ్రేకింగ్ టార్గెట్‌ను ఛేజ్ చేసిన పాక్, ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించింది. కానీ, ఆ మరుసటి మ్యాచ్‌లోనే ఫేలవ ప్రదర్శన కనబర్చి.. పాకిస్థానోళ్లు అంటాఱ్రా బాబు అనిపించుకుంది. అయితే.. మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో తమ తొలి మ్యాచ్‌ను పాకిస్థాన్, న్యూజిలాండ్‌తోనే ఆడనుంది. మెగా టోర్నీలో ఓపెనింగ్ మ్యాచ్‌ను ఆడే జట్టుపై ఇలాంటి ఫేలవ ప్రదర్శన కనబర్చడంతో పాక్ జట్టు ఆత్మవిశ్వాసం సన్నగిల్లడంతో పాటు, కివీస్ మంచి కాన్ఫిడెన్స్‌తో బరిలోకి దిగుతుంది.

# న్యూజిలాండ్‌కు బ్యాడ్ న్యూస్! టోర్నమెంట్ నుండి తప్పుకున్న స్టార్ పేసర్




**తొలిఅడుగు,** : ఐసిసి 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు న్యూజిలాండ్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ బెన్ సియర్స్ తొడ కండరాల గాయంతో టోర్నమెంట్ నుండి తప్పుకోవాల్సి వచ్చింది. ఫిబ్రవరి 19న ప్రారంభమయ్యే ఈ మెగా టోర్నీకి ముందు సియర్స్ గాయం పడ్డట్లు న్యూజిలాండ్ క్రికెట్ ప్రకటించింది. "బుధవారం కరాచీలో జరిగిన శిక్షణ సమయంలో సియర్స్ ఎడమ కాలి స్నాయువులో నొప్పిని అనుభవించాడు. స్కాన్ పరీక్షల్లో కనీసం రెండు వారాల విశ్రాంతి అవసరం అని తేలింది. అతను గ్రూప్ దశ చివరి మ్యాచ్ (భారత్‌తో)కే అందుబాటులో ఉండే అవకాశం ఉండడంతో, అతన్ని తప్పించాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది. సియర్స్ లేకపోవడంతో జాకబ్ డఫీ జట్టులోకి వచ్చాడు. ప్రస్తుతం అతను పాకిస్తాన్, దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే ట్రై-సిరీస్‌లో ఆడుతున్నాడు. న్యూజిలాండ్ ప్రధాన కోచ్ గ్యారీ స్టీడ్ మాట్లాడుతూ, "బెన్ పట్ల మేమంతా సానుభూతి చెందుతున్నాం. ఇంత ముఖ్యమైన టోర్నమెంట్‌కు ముందు గాయపడటం కష్టం. అతనికి ఇది తొలి ఐసిసి మెగా ఈవెంట్ కావడంతో మరింత నిరాశ కలిగించేదిగా మారింది," అని తెలిపారు. గ్రూప్ దశలో ఎక్కువ భాగం కోల్పోయే అవకాశం ఉన్నందున, పూర్తిగా ఫిట్‌గా ఉన్న ఆటగాడిని ఎంపిక చేయడం సముచితంగా భావించాం అని, బెన్ ఒక అద్భుతమైన ఆటగాడు, అతను త్వరగా కోలుకుని, పాకిస్తాన్‌తో స్వదేశంలో జరగనున్న సిరీస్‌కు సిద్ధంగా ఉంటాడని ఆశిస్తున్నాం, అని స్టీడ్ అన్నారు. జాకబ్ డఫీ ఎంపికపై స్టీడ్ విశ్వాసం వ్యక్తం చేశారు. "డఫీ ఇటీవల శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేశాడు. అతను ఇప్పటికే వన్డే ట్రై-సిరీస్‌లో భాగమైనందున, జట్టుతో పూర్తిగా అలవాటు పడిపోయాడు. వీటి పరిస్థితులకు అతనికి అనుభవం ఉంది. అతను ఫిట్‌గా, సిద్ధంగా ఉన్నాడు," అని తెలిపారు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో న్యూజిలాండ్ తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 19న కరాచీలో పాకిస్తాన్‌తో ఆడనుంది. జట్టుకు సియర్స్ గాయపడ్డప్పటికీ, డఫీతో పాటు మిగతా బౌలింగ్ విభాగం మరింత మెరుగైన ప్రదర్శన ఇచ్చేలా ప్రయత్నించనుంది. ఈ కొత్త మార్పులు న్యూజిలాండ్ ఛాంపియన్స్ ట్రోఫీ విజయ యాత్రపై ఎంత ప్రభావం చూపుతాయో చూడాలి.

# అక్కడ కూడా కింగ్ డామినేషనేగా!



**తొలిఅడుగు,** : భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందులోనూ, క్రికెట్‌కు ప్యాషన్‌గా నిలిచే పాకిస్థాన్‌లో కూడా కోహ్లీకి విపరీతమైన అభిమానులున్నారు. ఈ విషయం మరోసారి నిరూపితమైంది, అది కూడా కరాచీ స్టేడియం దగ్గర! న్యూజిలాండ్‌తో జరిగిన ట్రై-సిరీస్ ఫైనల్ అనంతరం, కరాచీ నేషనల్ స్టేడియం వెలుపల పెద్ద సంఖ్యలో క్రికెట్ అభిమానులు గుమిగూడారు. వారిలో ఒక అభిమాని కోహ్లీ అభిమానాన్ని వ్యక్తపరిచేందుకు ముందుకొచ్చి, "విరాట్ కోహ్లీ జిందాబాద్!" అని నినాదాలు చేశాడు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. పాకిస్థాన్ యువత కోహ్లీపై చూపిస్తున్న ప్రేమ క్రికెట్‌కు ఉన్న సరిహద్దులు లేవని మరోసారి రుజువు చేస్తోంది. ఐపీఎల్‌లో కోహ్లీ ప్రాతినిధ్యం వహించే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు గురించి కూడా అక్కడి అభిమానులు '%=జదో =జదో%' అంటూ హోరెత్తించారు. 36 ఏళ్ల కోహ్లీ తన కెరీర్‌లో అనేక రికార్డులను నెలకొల్పాడు. 2023 ప్రపంచ కప్‌లో సచిన్ టెండూల్కర్ 50 వన్డే సెంచరీల రికార్డును అధిగమించడం అతని ఘనతలో మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. బ్యాటింగ్ ఫామ్‌లో కొంత పడిపోయినా, ఆయనపై అభిమానులు చూపించే మక్కువ మాత్రం ఏ మాత్రం తగ్గలేదు. ఫిబ్రవరి 19 నుంచి పాకిస్థాన్ వేదికగా ప్రతిష్టాత్మక ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. ఈ మెగా టోర్నీ కోసం ఏర్పాట్లు చివరి దశకు చేరుకోగా, కరాచీ స్టేడియంలో ఓపెనింగ్ సెరమనీ నిర్వహించనున్నారు. ఈ వేడుకకు వేలాది మంది అభిమానులు హాజరవ్వనున్నారు.క్రికెట్ మైదానంలో కోహ్లీ, బాబర్ ఆజమ్ ఇద్దరూ గొప్ప బ్యాటర్లు. కానీ, కోహ్లీ ఫ్యాన్ ఫాలోయింగ్ మాత్రం అంతర్జాతీయ స్థాయిలో విపరీతంగా ఉంది. పాకిస్థాన్ యువ క్రికెటర్లు కూడా కోహ్లీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతున్నారు. క్రికెట్‌లో ద్వేషానికి స్థానం లేదు. ఇది అభిమానంతో నిండిన ఒక ప్రపంచం. పాకిస్థాన్ అభిమానులు 'విరాట్ కోహ్లీ జిందాబాద్' అని నినదించడం, క్రికెట్ సమగ్రతకు అద్భుతమైన ఉదాహరణ. ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు కోహ్లీపై ఇంతటి మోజు చూస్తుంటే, భవిష్యత్తులో మరిన్ని ఆసక్తికర క్షణాలు మేము చూడబోతున్నామన్న విషయం ఖాయం!

# ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు పాకిస్థాన్‌కి భారీ షాక్!

**తొలిఅడుగు,** : ట్రై-నేషన్స్ సిరీస్ ఫైనల్లో న్యూజిలాండ్ పాకిస్తాన్‌పై ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలర్ విల్ ఓ'రూర్కే నాలుగు వికెట్లు తీసి కీలక పాత్ర పోషించగా, మిచెల్, లాథమ్ అర్ధ సెంచరీలతో మెరిశారు. పాకిస్తాన్ 242 పరుగులకే ఆలౌటవ్వగా, న్యూజిలాండ్ 45.2 ఓవర్లలో విజయాన్ని ఖరారు చేసింది. ఈ గెలుపుతో కివీస్ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం పెరిగింది, ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఇదే ప్రదర్శన చూపుతారా అన్నది ఆసక్తిగా మారింది.ట్రై-నేషన్స్ సిరీస్ ఫైనల్లో న్యూజిలాండ్ జట్టు పాకిస్తాన్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించి టైటిల్ గెలుచుకుంది. బుధవారం ఇదే వేదికపై జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభ మ్యాచ్‌కి ముందుగా ఈ విజయంతో కివీస్ ఆటగాళ్లకు మంచి ప్రేరణ లభించింది.ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పేస్ బౌలర్ విల్ ఓ'రూర్కే నాలుగు వికెట్లు పడగొట్టి తన జట్టుకు విజయానికి సహకరించగా, డారిల్ మిచెల్ (57), టామ్ లాథమ్ (56) అర్ధసెంచరీలతో చెలరేగారు. పాకిస్తాన్ బ్యాటింగ్ చేసిన 49.3 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌటైంది. న్యూజిలాండ్ 45.2 ఓవర్లలో 243/5తో విజయాన్ని సాధించింది. న్యూజిలాండ్ ఛేజింగ్‌ను మొదట్లో ఓపెనర్ విల్ యంగ్ తొందరగా ఔటవ్వడం కాస్త కష్టతరం చేసినా, డెవాన్ కాన్వే (48), కేన్ విలియమ్సన్ (34) రెండో వికెట్‌కు 71 పరుగుల భాగస్వామ్యం అందించి జట్టును నిలబెట్టారు. కానీ, స్పిన్నర్ సల్మాన్ ఆఘా వేసిన బంతికి విలియమ్సన్ వికెట్ కోల్పోయాడు. ఆ తర్వాత మిచెల్-లాథమ్ జోడీ నాల్గవ వికెట్‌కు 87 పరుగులు జోడించి గెలుపు బాట పట్టించారు. చివర్లో గ్లెన్ ఫిలిప్స్ (20 నాటౌట్) సహాయంతో న్యూజిలాండ్ విజయాన్ని ఖరారు చేసింది. పాకిస్తాన్ బ్యాటింగ్ విభాగంలో టాప్ స్కోరర్‌గా మహ్మద్ రిజ్వాన్ (46) నిలవగా, సల్మాన్ ఆఘా (45), తయ్యబ్ తాహిర్ (38) కొంత పోరాడారు. అయితే, ఓ'రూర్కే (4/43), మిచెల్ సాంట్నర్ (2/20), మైఖేల్ బ్రేస్‌వెల్ (2/38) ధాటికి భారీ స్కోరు నమోదు చేయలేకపోయారు. పాక్ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ మాట్లాడుతూ, "మేము 280కి పైగా స్కోరు చేయాలని అనుకున్నాం కానీ న్యూజిలాండ్ బౌలర్లు మమ్మల్ని కట్టడి చేశారు. నా వికెట్ చాలా కీలకంగా మారింది, చివరికి 15 పరుగుల తక్కువ స్కోరుతో మేము వెనుకబడిపోయాం" అని చెప్పారు.




న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ మాట్లాడుతూ, "ఈ విజయంతో మేము మంచి ఉత్సాహంతో ఉన్నాం. విభిన్న పరిస్థితుల్లో వేర్వేరు ఆటగాళ్లు రాణించడం సానుకూలమైన అంశం. కానీ, అసలైన పరీక్ష ఛాంపియన్స్ ట్రోఫీలో మొదటి మ్యాచ్‌తోనే ప్రారంభమవుతుంది" అని తెలిపారు. ఈ విజయంతో న్యూజిలాండ్ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం పెరిగింది. బుధవారం ఛాంపియన్స్ ట్రోఫీ ఓపెనర్‌లో కూడా వారు అదే ప్రదర్శనను కొనసాగిస్తారా? అనేది ఆసక్తిగా మారింది.